E-KABURU

# ఈ-కబురు

26-02-2025 బుధవారం హైదరాబాద్ ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

www.ekaburu.com



బుట్టబొమ్మ బోల్డ్ ఫోటో షూట్..

6 లో

# 36 సార్లు ఢిల్లీకి వెళ్లి పీకేదేంటి..?



15 నెలల్లో ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఎదురుగాలి

ఎస్ఎల్‌బీసీలో 8 మంది చిక్కుకున్నా పట్టింపులేదు

సీఎం నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారు

రేవంత్‌రెడ్డికి బీజేపీ రక్షణ కవచం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, ఈ-కబురు:** బీఆర్ఎస్ పార్టీలో కాంగ్రెస్ నేతలు చేరుతున్నారని, ఇక రేవంత్‌రెడ్డి సర్కారు పతనానికి ఇదొక సంకేతమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ ఇప్పటికీ 35 సార్లు ఢిల్లీ వెళ్లి చేసిందేమిటీ..? తాజాగా 36వ సారి వెళ్లి ఇప్పుడు పీకేదేంటి..? అని ప్రశ్నించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ కీర్తీవెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నేత మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు.

**రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఎదురుగాలి..**

రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌తోపాటు తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఎదురుగాలి వీస్తోందన్నారు. 15 నెలల్లోనే కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిందన్నారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఎనిమిది మంది చిక్కుకున్నా పట్టించుకోకుండా సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని విమర్శించారు. తెలంగాణలో సీఎం రేవంత్ నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారని, కేసీఆర్‌పై కోపంతో కాంగ్రెస్ తెలంగాణలో కరవు తీసుకొచ్చిందని ఆరోపించారు.

**రేవంత్‌కు బీజేపీ రక్షణ కవచం..**

సీఎం రేవంత్‌కు బీజేపీ పార్టీ రక్షణ కవచంగా మారిందని ఎద్దేవా చేశారు. ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోదీ

మిగతా 2లో



# వైసీపీ.. ఓ విధ్వంస శక్తి

ఆ పార్టీకి ఇక నూకలు చెల్లినట్లే.. మరో 15 ఏళ్లు.. కూటమి పాలనే

ఇక..అధికార, విపక్ష పాత్రలూ మావే.. విభేదాలున్నా సర్దుకుపోతాం

గవర్నర్ ప్రసంగం వేళ.. ఈ వీరంగాలేంటి?

రాజధానిపై ఆ పార్టీ మూడుముక్కలాట

కుదేలైన ఏపీని పట్టాలెక్కిస్తున్నాం.. మోదీ అండతో ఏపీ పునర్నిర్మాణం

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా పాలన.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

2 లో



## ప్రగతి బాటన.. అసోం

ఆరేళ్లలో అసోంలో రెట్టింపు వృద్ధి

తయారీ రంగానికి కేరాఫ్‌గా మార్చుతాం

అనుసంధానం మరింత పెంచుతాం

వాణిజ్య సదస్సులో ప్రధాని మోదీ

2 లో



మాజీ ఎంపీ సజ్జన్‌కు

## జీవిత ఖైదు

సిక్కుల ఊచకోత కేసులో కోర్టు తీర్పు

తండ్రీ కొడుకుల సజీవదహనం కేసు

41 ఏళ్ల తర్వాత దోషులకు శిక్ష

మరో రెండు కేసుల్లోనూ నిందితుడిగా సజ్జన్

2 లో

# కేసీఆర్‌ను టచ్ చేసే దమ్ముందా?

కులగణనకు తాము వ్యతిరేకం కాదు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు గెలుస్తాం

ఈ విషయం సీఎం రేవంత్‌కు తెలుసు

అందుకే జిల్లాల్లో హడావుడిగా ప్రచారం

నత్తనడకన ఫోన్ ట్యాపింగ్ కేసు

బీఆర్ఎస్ నుంచి హస్తం పెద్దలకు ముడుపులు

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

2 లో





# లైఫ్ సైన్సెస్ హబ్‌గా రాజధాని

ట్రిలియన్ ఎకానమీయే లక్ష్యం

ఆర్ఆర్ఆర్ వెంబడి ఫార్మా విలేజ్‌లు

5 లక్షల ఉద్యోగాల కల్పనకు రంగం

బయో ఆసియా-2025 సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఈ-కబురు:** ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ఫార్మా విలేజ్‌లు అభివృద్ధి చేస్తామని, దీని ద్వారా దాదాపు 5 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఫార్మా రంగం అభివృద్ధికి ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం హైదరాబాద్ హెచ్ఐసీసీలో బయో ఆసియా-2025 సదస్సును సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మేజర్ ఫార్మా కంపెనీలు, హెల్త్ కేర్ సంస్థలు, లైఫ్ సైన్సెస్ అండ్ బయో టెక్ కంపెనీలు హైదరాబాద్ నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నాయన్నారు. హైదరాబాద్ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ క్యాపిటల్‌గా మారుతుందనడానికి ఈ సదస్సు ఉదాహరణ అని చెప్పారు. ఏఐ, క్వాంటమ్, రోబొటిక్స్ సాయంతో వైద్యరంగం రూపులేఖలు మారుతున్నాయన్నారు.

**అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కేంద్రంగా నగరం..**

రాష్ట్రాన్ని రాబోయే పదేళ్లలో 1 ట్రిలియన్ ఎకానమీగా మార్చాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్

మిగతా 2లో



## ఒకే రోజు.. లక్ష రేషన్ కార్డులు

తెలంగాణ సర్కారు గుడ్ న్యూస్

మార్చి 1 నుంచి పంపిణీ షురూ

ఎమ్మెల్సీ కోడ్ వల్ల.. అక్కడ మార్చి 8 నుంచి

త్వరలోనే సన్నబియ్యం పంపిణీ

2 లో

# ప్రచారానికి తెర

తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

రెండు గ్రాడ్యుయేట్, ఒక ఉపాధ్యాయ స్థానంలో పోరు

ఏపీలో రెండు చోట్ల బరిలో కూటమి అభ్యర్థులు

ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

2 లో





## త్వరలోనే వర్గీకరణ చట్టం

పెద్దసంఖ్యలో ఉద్యోగాల భర్తీ చేపడుతాం

రేవంత్ నాయకత్వంలో చరిత్ర సృష్టిస్తాం

ఎస్సీ కులాల్లో అసమానతల వల్లే ఆందోళనలు

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

2 లో

# లైఫ్ సైన్సెస్ హబ్‌గా రాజధాని

మొదటి పేజీ తరువాయి

మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీతోపాటు అనేక భారీ ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు. భారత్‌లోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కేంద్రంగా నగరం మారిందన్నారు. హైదరాబాద్‌ను సరికొత్త ఆవిష్కరణల కేంద్రంగా మారుస్తామన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌కు మధ్య ఫార్మా విలేజ్‌లు డెవలప్ చేస్తామన్నారు.

**పెట్టుబడుల్లో తెలంగాణ నం.1..**

గతేడాది లైఫ్ సైన్సెస్ సెక్టర్‌లో రూ.40 వేల కోట్లు పెట్టుబడులు ఆకర్షించామని, ఇందులో దాదాపు 150 ప్రాజెక్టులు ఉన్నాయని సీఎం చెప్పారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో తెలంగాణకు 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. దేశీయంగా, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ నం.1గా ఉందన్నారు. దేశంలోనే అత్యధిక ఈవీ వాహనాల విక్రయాలతో హైదరాబాద్ ప్రస్తుతం ఈవీ కెపిటల్ ఆఫ్ ఇండియాగా అవతరించిందన్నారు. మొబిలిటీతో పాటు, పర్యావరణ అనుకూల వ్యవస్థలు అవసరమన్నారు. అందుకే జీహెచ్ఎంసీ పరిధిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



**తెలంగాణలో డ్రైపోర్టులు..**

తెలంగాణలో డ్రైపోర్టును నిర్మిస్తున్నామని చెప్పారు. డ్రైపోర్టుకు సమీపంగా ఉన్న ఏపీలోని సీపోర్టుకు ప్రత్యేకంగా రోడ్డు, రైలు మార్గాలతో అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. విద్యారంగ అభివృద్ధికి పెద్దమొత్తంలో ఖర్చు చేస్తున్నామన్నారు. యువతలో ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. సోమవారం అమెజాన్ కంపెనీ ప్రతినిధులతో భేటీ జరిగిందని, దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌కు రావడానికి ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు.

**50 దేశాల నుంచి 3 వేల మంది ప్రతినిధులు..**

సరికొత్త ఆలోచనలు, నూతన ఆవిష్కరణలకు ఉద్దేశించిన అంతర్జాతీయ వేదిక బయో ఆసియా-2025 సదస్సు రెండు రోజులు జరగనున్నది. ఈ సదస్సులో 50 దేశాల నుంచి 3 వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. లైఫ్ సైన్సెస్‌లో ఆధునిక మార్పులు, పురోగతిపై చర్చించనున్నారు. క్యాటలిస్ట్ ఆఫ్ చేంజ్.. ఎక్స్ పాండింగ్ గ్లోబల్ హెల్త్ కేర్ ఫ్రాంటీయర్స్ థీమ్‌తో సదస్సు జరుగుతోంది. ఏఐతో వచ్చిన మార్పులపై పరిశోధనే ఎజెండాగా లైఫ్ సైన్సెస్ భవిష్యత్తును నిర్దేశించే కొత్త ఆవిష్కరణలు, గ్లోబల్ బయో ఎకానమీని బలోపేతం చేయడం, ఇంటిగ్రేటెడ్ హెల్త్ కేర్ మోడల్స్‌పై చర్చించనున్నారు.

**ప్రధాని మోడీతో భేటీకానున్న సీఎం**

ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ శాంతి కుమారి, సీఎంవో సెక్రటరీ శేషాద్రి, డీజీపీ జితేందర్‌తో కలిసి ప్రధానితో సమావేశం కానున్నారు. హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్‌కు నిధులు, మెట్రో పొడిగింపు కోసం ఆర్థిక సాయం, ఐపీఎస్ కేడర్ పెంపు ఇతర అంశాలపై ప్రధానికి మెమొరాండం ఇవ్వనున్నారు. ప్రధాని మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులను సీఎం రేవంత్ కలువనున్నారని సమాచారం. మంగళవారం రాత్రికే సీఎం రేవంత్ బృందం ఢిల్లీకి వెళ్లింది. ప్రధానితో భేటీ అనంతరం కాంగ్రెస్ అధిష్టానం పెద్దలను రేవంత్ కలిసే అవకాశం ఉంది. మంత్రివర్గ విస్తరణతో పాటు, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై పార్టీ అధిష్టానం పెద్దలతో చర్చిస్తారని తెలుస్తోంది.

## మొదటి పేజి తరువాయి

### 36 సార్లు ఢిల్లీకి వెళ్లి పీకేదేంటి..?

అన్నారని, కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని ప్రయత్నించి కొంతవరకు విజయవంతం అయ్యారని ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటుందని, త్వరలో తామేంటో చూపిస్తామని స్పష్టంచేశారు.

**తెల్లారిలేస్తే కేసీఆర్ జపం..**

రైతుల ఆత్మహత్యలు, కార్మికులు ఇరుక్కుపోతే సోయి లేకుండా సీఎం రేవంత్ గాల్లో చక్కర్లు కొడుతున్నారని ఆరోపించారు. తెలంగాణకు హోం మంత్రి, విద్యాశాఖ మంత్రి, సంక్షేమ శాఖ మంత్రి లేడన్నారు. మంత్రులను నియమించుకోలేని అసమర్థ సీఎం రేవంత్ అని మండిపడ్డారు. కేసీఆర్ ఆనవాళ్లు మాయం చేస్తానని సీఎం మాట్లాడుతున్నారని, తెల్లారిలేస్తే కేసీఆర్ జపం చేయని రోజు ఉండదని ఎద్దేవా చేశారు. రేవంత్‌ను ప్రజలు లక్కీలాటరీలో గెలిపించారని తెలిపారు.

**దగాపడ్డ తెలంగాణ 36వ సారి!**

సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా దగాపడ్డ తెలంగాణ 36వ సారి అంటూ బీఆర్ఎస్ పార్టీ ఆసక్తికర ట్వీట్ చేసింది. రేవంత్ చేతిలో తెలంగాణ దగాపడ్డదని బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు చేసింది. పాలన గాలికొదిలి ఢిల్లీకి వెళ్తున్నారని, కప్పం కడితేనే, పదవి ఉంటదని బీఆర్ఎస్ ఆరోపించింది. కాంగ్రెస్ అధిష్టానం మెప్పుపొందడానికి 36 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్‌కి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి 72 గంటలు అవుతున్నా ప్రమాదంలో చిక్కుకున్న వారి దగ్గరకు వెళ్లే సమయం లేదని బీఆర్ఎస్ విమర్శించింది.

## త్వరలోనే వర్గీకరణ చట్టం

**హైదరాబాద్, ఈ-కబురు:** త్వరలో ఎస్సీ వర్గీకరణ చట్టం చేస్తామని, ఆ తర్వాత పెద్దసంఖ్యలో ఉద్యోగాల భర్తీ చేపడుతామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొత్త చరిత్ర సృష్టించబోతున్నామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో జరిగిన మాదిగ అమరవీరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన వారికి మంత్రి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబ సభ్యుల కాళ్లు మంత్రి కడిగారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున మంత్రి ఆర్థికసాయం అందజేశారు.

**హక్కుల సాధన కోసం సుదీర్ఘ పోరాటం..**

ఎస్సీ కులాల్లో అసమానతల వల్లే ఆందోళనలు మొదలయ్యాయన్నారు. హక్కుల సాధన కోసం సుదీర్ఘ పోరాటం జరిగిందని చెప్పారు. జాతి ప్రయోజనాల కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల కుటుంబాలకు మాదిగలు జీవితాంతం రుణపడి ఉంటారని తెలిపారు. మార్చి 3న రవీంద్ర భారతిలో మాదిగల కృతజ్ఞత సభ ఉంటుందని పేర్కొన్నారు. వర్గీకరణ ఉద్యమం అసహనం, అభద్రతల నుంచి వచ్చిందని గుర్తుచేశారు. పోరాటం ఎవరికి వ్యతిరేకం కాదన్నారు. ఉప కులాల అందరికీ న్యాయం జరగాలన్నారు. వర్గీకరణలో ఎవరి వాట వాళ్లకు అందుతుందన్నారు. అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**రాజకీయ రంగు పూయకూడదు..**

ఎన్నితరాలైనా అమరుల రుణం తీర్చుకోలేనిదన్నారు. హక్కుల కోసం జరిగే పోరాటాలకు రాజకీయ రంగు పూయకూడదని, మానవత్వంతో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వర్గీకరణ విషయంలో అదే జరిగిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే వర్గీకరణకు అనుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేశారని గుర్తుచేశారు. మాదిగల పట్ల ఆయన నిబద్ధత, పేదల హక్కుల పట్ల చిత్తశుద్ధి అని కొనియాడారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుకూలంగా, వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసేలా అన్నివిధాల అధ్యయనం చేసిన తర్వాత వన్ మ్యాన్ కమిషన్ నివేదిక ఇచ్చిందని, అందులో వంకలు పెట్టడానికి ఏమీ లేదని స్పష్టం చేశారు. వర్గీకరణపై అబద్ధాలు, మోసం, రాజకీయం కోసం విమర్శలు చేయొద్దన్నారు. మీకు ఎక్కడ అవసరం ఉన్నా ఆదుకునే బాధ్యత తమ ప్రభుత్వానిది అని హామీ ఇచ్చారు.

# కేసీఆర్‌ను టచ్ చేసే దమ్ముందా?

**హైదరాబాద్, ఈ-కబురు:** కులగణనకు తాము వ్యతిరేకం కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన కరీంనగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి కూడా తెలుసన్నారు. అందుకే మూడు జిల్లాల్లో హడావుడిగా ప్రచారం నిర్వహించారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలని ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ తప్పుడు హామీలు..**

కాంగ్రెస్ ఎన్నికల్లో తప్పుడు హామీలు ఇచ్చి గద్దెనెక్కిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితం తమకు అనుకూలంగా రాబోతుందని జోస్యం చెప్పారు. బీసీల కులగణనన తప్పుల తడకగా సాగిందని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లు అని ప్రభుత్వం చెబుతోందని, 32 శాతం మాత్రమే అమలు చేయలేనే కుట్ర చేస్తోందన్నారు. తాజాగా, నిర్వహించిన సమగ్ర సర్వేలో గతంలో కన్నా బీసీలు ఎందుకు తగ్గారని ప్రశ్నించారు. సమాధానం చెప్పలేకనే ప్రభుత్వం రీ సర్వే పేరుతో నాటకాలు ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు అన్యాయం చేసేందుకు సమగ్ర సర్వేను తీసుకొచ్చారని మండిపడ్డారు. కులగణనకు తాము వ్యతిరేకం కాదని, ముస్లింలను బీసీల్లో కలిపి రిజర్వేషన్లు అమలు చేస్తామని చూస్తే తాము ఒప్పుకోబోమని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ నుంచి ఢిల్లీ పెద్దలకు ముడుపులు..**

ఫోన్ ట్యాపింగ్ కేసు నత్తనడకన నడుస్తోందని ఆరోపించారు. అసలు కేసీఆర్‌ను టచ్ చేసే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి ఢిల్లీలోని హస్తం పెద్దలకు ఇప్పటికే ముడుపులు వెళ్లాయని ఆరోపించారు. అందుకే ఫోన్ ట్యాపింగ్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం మూలన పడేసిందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌కు రేవంత్ ప్రభుత్వం ఇంతవరకూ ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో ఈవెంట్ ఆర్గనైజర్ పేరు ఎందుకు చేర్చలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలు జరిగితే ఇప్పటివరకూ కేసీఆర్‌ను ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. జన్వాడ ఫామ్ హౌస్ కేసు ఏమైందంటూ విమర్శించారు. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితను తామే అరెస్టు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే కేసీఆర్ కేసులను సీబీఐకి అప్పగించాలని సవాల్ చేశారు.

**బీజేపీకి ఓటేయాలి..**

మొన్న ఇండియా -పాకిస్థాన్ మ్యాచ్ జరిగిందని అందులో భారత్ అద్భుత విజయ సాధించిందన్నారు. ఈ నెల 27న కూడా రాష్ట్రంలో ఇండియా-పాక్ మ్యాచ్‌లాగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగబోతోందని, ఇండియా గెలవాలని కోరుకునే వారు బీజేపీకి ఓటు వేయాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

**సంజయ్‌పై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు..**

కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలకు ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కరీంనగర్ వెళ్లగానే సంజయ్ కార్పొరేటర్‌గా మారిపోతారని ఎద్దేవా చేశారు. ఇండియా గెలవాలంటే బీజేపీకి ఓటు వేయాలని, పాకిస్థాన్ గెలవాలంటే కాంగ్రెస్‌కి ఓటు వేయాలని మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి, నిరుద్యోగ సమస్యల గురించి మాట్లాడకుండా సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు బండి సంజయ్‌పై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు.

**కేంద్ర నిధులపై చర్చకు సిద్ధమా? : కిషన్‌రెడ్డి**

తెలంగాణ అభివృద్ధికి తాను అడ్డుకుంటున్నానని సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తాను ఏ విషయంలో అడ్డుకున్నానో చెప్పాలని సవాల్ విసిరారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను మళ్లిస్తూ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతోందన్నారు. నిరుపేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తే, రేషన్ కార్డులపై కేంద్రం అనవాళ్లు లేకుండా చేసిందని ఫైర్ అయ్యారు.

**ఆరోపణలు నిరూపించాలి..**

పీఎంఏవై పథకం కింద కేంద్రం ఇళ్లు మంజూరు చేస్తే, అవి ఇందిరమ్మ ఇళ్ల అని చెప్పుకుంటున్నామని ఆరోపించారు. అందుకు ప్రభుత్వమే నిధులు మంజూరు చేస్తుందంటూ కాంగ్రెస్ పెద్దలు చెప్పడం సిగ్గుచేటన్నారు. రేవంత్ తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు.

## ప్రగతి బాటన.. అసోం

**నేషనల్ బ్యూరో, ఈ-కబురు:** అసోం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వశర్మ పాలనలో అసోం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేశారు. మంగళవారం రాజధాని గౌహతిలో అడ్వాంటేజ్ అసోం 2.0 బిజినెస్ సమ్మిట్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. గత ఆరేళ్ల బీజేపీ పాలనలో అసోం రాష్ట్ర ఆర్థికాభివృద్ధి రెట్టింపు అయిందని, దేశాభివృద్ధిలో అసోం భాగస్వామ్యం నానాటికీ పెరగటం పట్ల ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు.

**ప్రగతి కేంద్రంగా ఈశాన్యం**

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. తూర్పు, ఈశాన్య ప్రాంతాలు దేశం భవిష్యతులో కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టాయన్నారు. అందులో భాగంగా అసోం పురోగతి.. ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలుస్తోందన్నారు. ఆ సమయంలో ఈ రాష్ట్ర ఆర్థికాభివృద్ధి విలువ రూ. 2.75 లక్షల కోట్లు ఉండగా.. నేడు అది రూ. 6 లక్షల కోట్లకు చేరుకొందని ప్రధాని నరేంద్ర మోదీ గణాంకాలతో సహా సోదాహరణగా వివరించారు.

## మాజీ ఎంపీ సజ్జన్‌కు జీవిత ఖైదు

నేషనల్ బ్యూరో: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్య అనంతరం దేశ రాజధానిలో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల సందర్భంగా ఒక హత్య కేసులో కాంగ్రెస్ మాజీ ఎంపి సజ్జన్ కుమార్‌కు ఢిల్లీ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 1984 నవంబర్ 1న జస్వంత్ సింగ్, అతని కుమారుడు తరుణ్‌దీప్ సింగ్ హత్యలకు సంబంధించి ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా తీర్పు వెలువరించారు.

**సజీవ దహనం కేసు..**

1984 నవంబర్ 1న ఢిల్లీలోని సరస్వతి నగర్‌లో సజ్జన్ కుమార్ నాయకత్వంలో మారణాయుధాలు ధరించిన ఒక గుంపు.. అక్కడ నివసించే.. సిక్కు మతస్తుల మీద దాడి చేసింది. ఈ క్రమంలో ఆ గుంపు ఓ ఇంటిపై విరుచుకుపడింది. ఆ ఇంటిని లూటీ చేశాక.. గుంపులోని కొందరు తండ్రీ కొడుకులైన జశ్వంత్ సింగ్, తరుణ్‌దీప్ సింగ్‌లను ఇంటినుంచి బయటికి లాక్కొని వచ్చి వారికి నిప్పంటించి, సజీవ దహనం చేశారు. ఈ కేసులో రంగనాథ్ మిశ్రా కమిషన్ ముందు ఇచ్చిన జశ్వంత్‌సింగ్ భార్య ఇచ్చిన అఫిడవిట్ ఆధారంగా నాడు కేసు నమోదైంది.

## ప్రచారానికి తెర

**హైదరాబాద్, ఈ-కబురు:** ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసింది. దీంతో ఎక్కడికక్కడ మైకులు మూగబోయాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏపీలో 3, తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 3న నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 3 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరించారు. ఈ నెల 8, 9 తేదీల్లో ప్రభుత్వ సెలవు కావడంతో ఈ నెల 11న నామినేషన్ల పరిశీలించారు. 13న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. 15 రోజుల పాటు కొనసాగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ, కాంగ్రెస్, కూటమి, స్వతంత్ర అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారం కొనసాగించారు.

**ఈ నెల 27న పోలింగ్..**

మూడు ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4:00 వరకు జరగనుంది. ఓట్ల లెక్కింపు మార్చి 3న జరుగనుంది. వరంగల్- ఖమ్మం- నల్లగొండ నియోజకవర్గ పరిధిలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 200 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రకారం.. కరీంనగర్ పట్టభద్రుల ఓటర్లు 3,41,313గా, టీచర్లు 25,921 ఓటర్లుగా ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఓటర్లు 3,41,313 మంది, ముగ్గురు థర్డ్ జెండర్లు, ఉపాధ్యాయ ఓటర్లు 25,921 మంది ఉన్నారు. ఓటర్ల సంఖ్య క్రమంలో పట్టభద్రులకు సంబంధించి 499, ఉపాధ్యాయ ఓటర్లకు 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

## ఒకే రోజు.. లక్ష రేషన్ కార్డులు

**హైదరాబాద్, ఈ-కబురు:** తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రకటించింది. మార్చి ఒకటిన ఒకే రోజు లక్ష కార్డులు జారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది ఈ మేరకు ఇప్పటికే జిల్లాల వారీగా కొత్త రేషన్ కార్డుల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**పదేళ్ల తర్వాత..**

తెలంగాణలో 2014 నుంచి కొత్త కార్డులు జారీ చేయలేదు. ఈ దశాబ్ద కాలంలో ఎప్పటికప్పుడు కొత్త కార్డుల కోసం జనం దరఖాస్తులు పెట్టుకుంటూ వచ్చారు. ఈ పదేళ్లలో పెళ్లి చేసుకొని అత్తగారింటికి వచ్చిన కోడళ్లు, కొత్తగా జన్మించిన పిల్లల పేర్లు కార్డుల్లో చేర్చాల్సి ఉండగా, చనిపోయిన వారి పేర్లు తీసేసి తాజాగా కార్డులు ఇవ్వాల్సి ఉంది.

# వైసీపీ.. ఓ విధ్వంస శక్తి

**అమరావతి, ఈ-కబురు:** మరో పదిహేనేళ్లపాటు తమ కూటమి కలిసే ఉంటుందని ఉప ముఖ్యమంత్రి పవన కల్యాణ్? తేల్చి చెప్పారు. మంగళవారం సాయంత్రం గవర్నర్? ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో అసెంబ్లీ వేదికగా ఆయన ప్రసంగించారు. గవర్నర్?ను గౌరవించే విధానం ఇదేనా అంటూ వైసీపీ తీరును ఎండగట్టారు. రాజధాని అమరావతి విషయంలో గత వైసీపీ ప్రభుత్వం మూడుముక్కలాట ఆడిందని, గత ఐదేళ్లలో ఏపీలో శాంతిభద్రతలు క్షీణించాయని పవన్ కల్యాణ్ అన్నారు.

**విధ్వంస పోకడ..**

గవర్నర్ ప్రసంగం సమయంలో వైసీపీ సభ్యుల తీరు చూస్తే..తనకు పాలసీ టెర్రరిజం గుర్తుకు వచ్చిందని పవన్ కల్యాణ్ విమర్శించారు. వైసీపీ పాలనలో ఏపీ సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి గవర్నర్ ఈఎస్ఎల్ నర్సింహన్ ఉన్నప్పుడు తెలంగాణ అంశంలో అసెంబ్లీలో ఇలాంటి గొడవ చూశానని, సోమవారం వైసీపీ నేతల తీరు నాటి ఘటనలను గుర్తుకు తెచ్చిందని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. అసలు అసెంబ్లీలో ఇలా ప్రవర్తించవచ్చా? అని తనకు అనిపిస్తోందని అన్నారు. గవర్నర్ ప్రసంగ సమయంలో సభలోని సభ్యులంతా హుందాగా వ్యవహరించాలని రూల్ బుక్‌లో ఉందని పవన్ గుర్తుచేశారు. వైసీపీ అనేది గొడవలకు పర్యాయపదమని విమర్శించారు.

**అవన్నీ గుర్తుకొచ్చాయి..**

సోమవారం గవర్నర్ ప్రసంగం వేళ.. వైసీపీ సభ్యులు గవర్నర్ ప్రసంగకాపీలను చించి పోడియం మీదికి ఎగబడటం చూస్తూ.. తనకు వివేకానంద రెడ్డి హత్య గుర్తుకువచ్చిందని, ప్రజావేదికను అకారణంగా కూల్చిన ఘటన గుర్తుకొచ్చాయని పేర్కొన్నారు. ఏపీలో గత ఐదేళ్లలో 200 ఆలయాలను కూల్చిన తీరు, సౌకర్యాల కోసం ప్రశ్నించిన పాపానికి డాక్టర్ సుధాకర్ చనిపోయిన తీరు, జంగారెడ్డిగూడెం కల్తీసారా మరణాలు గుర్తుకువచ్చాయని పవన్ కల్యాణ్ చెప్పారు. పత్రికాధిపతులపై దాడులు, హైకోర్టు న్యాయమూర్తులను సోషల్ మీడియాలో అసహ్యకరంగా ప్రచారం చేసిన వైనం గుర్తొచ్చాయన్నారు. మాజీ సీఎం, విపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడిని ఏకంగా 53 రోజులు జైల్లో పెట్టిన విధానం గుర్తుకు వచ్చిందని, అమరావతి రైతులను రక్తం కారేలా కొట్టించిన తీరు గుర్తుకొచ్చిందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం విజన్ 2047కు అనుగుణంగా పనిచేస్తోందని పవన్ ప్రకటించారు. పల్లె పండుగ పేరుతో గ్రామ సభలు నిర్వహించి, ప్రజా సమస్యలు వినటమే గాక రూ. 4500 కోట్ల వ్యయంతో 30వేల అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామని అన్నారు. ఆరునెలల్లో 4300 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, 22500 గోకులాలను నిర్మించామని తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం 268 మినిగోకులాలను మాత్రమే ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జలజీవన్ మిషన్‌ను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

**ఆర్థిక విధ్వంసం..**

గత ప్రభుత్వం అమరావతి మీద కుట్రలు పన్ని.. మూడు ముక్కలు ఆడటంతో పెట్టుబడులు రాక ఏపీ ఆర్థిక పరిస్థితి కుదేలైందని పవన్ గుర్తుచేశారు. అయినా.. ఇబ్బందులను భరిస్తూనే, వనరులను సమీకరించుకుంటూ.. తిరిగి ఏపీని దారిలో పెట్టే పనిలో ఉన్నామని జనసేనాని వెల్లడించారు. పంచాయితీరాజ్‌లో అవినీతికి తావు లేకుండా ఉద్యోగుల బదిలీలు చేశామని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ప్రతిభ ఆధారంగా రాష్ట్రంలోని వర్సిటీలకు వీసీల నియామకాన్ని చేపట్టామని, అందులో అన్ని వర్గాలకూ ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. విశాఖ స్టీల్?ప్లాంటుకు నిధులు ఇచ్చినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం విశాఖ స్టీల్?ప్లాంటులో ప్లాట్లు వేసేందుకు సిద్ధం కాగా, తమ ప్రభుత్వం దానిని కాపాడిందని పవన్ గుర్తుచేశారు. ఒక తల్లికి పుట్టిన బిడ్డల మధ్యే అనేక విబేధాలు ఉంటాయని, అలాంటిది అనేక పార్టీలున్న కూటమిలో చిన్న చిన్న అభిప్రాయ భేదాలు ఉండటంలో ఆశ్చర్యం లేదన్నారు. అయినా, ఏపీ ప్రజల కోసం, వారి భవిష్యత్ కోసం, మరోసారి వైసీపీని అసెంబ్లీలో అడుగుపెట్టనీయకుండా ఉండడం కోసం మరో 15 ఏళ్లు తాము కలిసే ఉంటామన్నారు. టీటీడీ తొక్కిసలాట ఘటన జరిగినపుడు తాను క్షమాపణ చెప్పానని, ఏపీ అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష పాత్రలను కూటమి పార్టీలే పోషిస్తాయని స్పష్టం చేశారు. జగన్?కు ఓట్ల శాతం ఆధారంగా విపక్ష హోదా కావాలంటే జర్మనీ వెళ్లాల్సిందేనని మరోసారి సూచించారు. 2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దేందుకు అంతా కలిసి కృషి చేస్తామన్నారు.

## మన్నేపల్లిలో శివరాత్రి రోజు విష్ణుపూజ

**గుంటూరు:** శివరాత్రి రోజు పరమశివుడికి పూజలు జరగడం సహజం. కానీ బొల్లాపల్లి మండలం మన్నేపల్లిస్వామి ఆలయంలో తిరునాళ్ల, వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించడం ప్రత్యేకత. ఇక్కడ శ్రీనివాసుడు మీసాలతో భక్తులకు దర్శనమిస్తాడు. స్వామిని కొలిచినవారికి సంతాన భాగ్యం కలుగుతుందని నమ్మకం. శివరాత్రి సందర్భంగా గుడికి వచ్చే భక్తుల కోసం దేవాదాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వినుకొండకు 46కి.మీ దూరంలో బొల్లాపల్లి మండలం రావులాపురం పంచాయతీ పరిధిలోని కొండపైన మన్నేపల్లి పేరుతో వేంకటేశ్వరస్వామి వెలిశాడని భక్తుల నమ్మకం. శ్రీమహావిష్ణువు శ్రీనివాసుని అవతారంలో కలియుగ వైకుంఠం తిరుమలకు చేరడానికి ముందుగా ఈ కొండకు వచ్చారని ప్రతీతి. శివరాత్రి సందర్భంగా గుంటూరు జిల్లాతో పాటు ప్రకాశం జిల్లా నుంచి వేలాదిగా భక్తుల తరలివస్తారు. శ్రీనివాసుడితోపాటు లక్ష్మినరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవారు విగ్రహాలు ఉన్నాయి. అందుకే ఇది మన్నేపల్లి లక్ష్మినరసింహస్వామి ఆలయంగా ప్రసిద్ధికెక్కింది. వినుకొండ డిపో నుంచి నేరుగా దేవాలయం వరకు తిరునాళ్ల రోజు బస్సులు తిరుగుతాయి.

## యాగంటిలో శివరాత్రి ఏర్పాట్లు

**కర్నూలు:** శివరాత్రిని పురస్కరించుకొని యాగంటి క్షేత్రం ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో తెలిపారు. క్యూలైన్ల వెంట చలువ పందిళ్లు, అవసరమైన చోట శామియానాలు, లైటింగ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దాతల సహకారంతో మజ్జిగ పాకెట్లను భక్తులకు అందించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చే భక్తులు వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఆలయంలో శానిటైజేషన్ పూర్తి చేసి అవసరమైన చోట డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశామన్నారు. భక్తుల స్నానాల కోసం ప్రత్యేక ట్యాంకులు, కొళ్ళాయి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవసరమైన భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశామన్నారు.

## పుణ్యస్నానాలకు రాజమండ్రి గోదావరి తీరం సిద్ధం

**రాజమహేంద్రవరం:** మహాశివరాత్రికి రాజమహేంద్రవరం గోదావరి ఘాట్‌ల వద్ద స్నానం ఆచరించేందుకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. .పుష్కరాలరేవు, గౌతమి ఘాట్, వీఐపీ ఘాట్‌లను అధికారులు పరిశీలించారు.అలాగే నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రేవులకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ రేవులోను ప్రజలకు సూచనలు ఇచ్చే పబ్లిక్ అడ్రాసింగ్ సిస్టమ్ ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్పొరే షన్, మెడికల్, ఫిషరీస్, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులతో జాయింట్ కంట్రోల్ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఘాట్‌లో పారిశుధ్యం బాగుండాలని, రేవుల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని, భక్తులకు ఎలాంటి అసౌ కర్యం కలుగకుండా జాయింట్ కంట్రోల్ కమిటీ 24గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అధికారుల పర్యవేక్షణ అత్యంత కీలకమని చెప్పారు. మహిళలు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలన్నారు.

## పట్టిసీమలో శివరాత్రి వేడుకలు

### దైవదర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

**ఏలూరు:** మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టిసీమలో సకల ఏర్పాట్లు చేశారు. .పోలవరం మండలం పట్టిసీమ రేవులో దైవదర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నారు. తాటాకు పందిళ్లకు, మరుగుదొడ్లు, లైటింగ్, బారికేడ్లను ఏర్పాటు చేశారు. అందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామని, అందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేసామని అన్నారు. గూడెం మండలం వీరంపాలెంలోని బాలాత్రిపుర సుందరీదేవి పీఠంలో మహాశివరాత్రి ఉత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. స్వామివారి దర్శనార్థం ఆలయానికొచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళ వాయిద్యాలతో వేదమంత్రాలతో ఆలయ ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన, దీక్షాధారణ, మహావిద్య పారాయణ, వేదపారాయణ, సర్వదేవతా ఆవాహనం, గోపూజ, సూర్యనమస్కారాలు, మహాలింగార్చన, స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మేథా సరస్వతి అమ్మవారికి లక్షపుష్పార్చన, విశ్వేశ్వరస్వామివారికి లక్ష బిల్వార్చన, ఆధ్యాత్మిక ఉపన్యాసం, భూప్రస్తార శ్రీచక్రార్చనతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. తెల్లవారుజాము నుంచి స్పటికలింగేశ్వర స్వామివారికినదీ జలాలతో అభిషేకాలు, 5 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం, వేదపారాయణ, రుద్రపారాయణ, రుత్వికులతో మహన్యాస పఠనం, మహాదేవునికి 12 రకాల విశేష ద్రవ్యాలతో మహాకుంభాభిషేకం చేస్తారు. విశ్వేశ్వర స్వామివారికి 11 లక్షల రుద్రాక్షలతో అర్చన, సర్వదేవతా హోమం, సంపూర్ణ పూర్ణాహుతి ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు.

## కోటప్పకొండకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

### రద్దీకి అనుగుణంగా ప్రత్యేక ట్రిప్పులు

**గుంటూరు:** కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండతో పాటు ఇతర ఆలయాలకు సోమవారం నుంచి అదనపు బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీఅధికారులు తెలిపారు. భక్తులకు రద్దీకి అనుగుణంగాబస్సులను ఏర్పాటు చేశామన్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట, కోటప్పకొండ కింద, పైనతో పాటు ఇతర శైవక్షేత్రాలలో మొత్తం క్యాంపులను ఏర్పాటు చేసి నిరంతరం సిబ్బంది పర్యవేక్షించనున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. అలానే మార్గమధ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. కోటప్పకొండ పైకి, కిందకి రాకపోకల కోసం ప్రత్యేకంగా బస్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. సాధారణ భక్తులతో పాటు వీఐపీల కోసం ప్రత్యేక బస్సులను కేటాయించినట్లు ఆర్‌ఎం తెలిపారు. రెండు మూడు రోజుల పాటు భారీ సంఖ్యలో బస్సులను తిప్పుతారు. గుంటూరు నుంచి చిలకలూరిపేట మీదుగా కోటప్పకొండకు చేరుకునే వీలుంది.

# శివుడు అభిషేక ప్రియుడు

### జాగరణం శివరాత్రి ప్రత్యేకం

## ఏడాదికి ఒక్కరోజైనా శివార్చన చేస్తే ముక్తి



**శ్రీకాళహస్తి:** శివుడు అభిషేక ప్రియుడే గాకుండా.. అలాగే బిల్వదళ ప్రియుడు. శివుడు ఎలా పిలిచినా అనుగ్రహిస్తాడని అందుకే భోళాశంకరుడని పురాణాలు కూడా చెబుతున్నాయి. అందుకే అభిషేకాలు, బిల్వార్చనలను శివరాత్రినాడు విధిగా చేస్తుంటారు. పరమశివుడు లింగాకారంలో పుట్టినరోజు కావడంచేత శివుడికి ఇష్టమైన ఆ రోజున శివపూజ జరపడం మంచిదని శైవం చెబుతోంది. త్రిమూర్తులలో మూడోవాడు శివుడు. బ్రహ్మ సృష్టికర్త. విష్ణువు సంరక్షకుడు. మహాశివరాత్రి వ్రతాచరణను గురించి లింగ పురాణం పేర్కొంటోంది. వ్రత ఉద్యాపన గురించి స్కందపురాణంలో వివరంగా ఉంది. శివరాత్రి నాడు పగలంతా ఉపవాసం, రాత్రిపూట లింగార్చన, జాగరణం చేస్తారు. లింగార్చన తరువాత పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం చేయడం కూడా ఓ అలవాటుగా వస్తోంది. శివరాత్రులు అయిదు రకాలు. అవి.. నిత్య శివరాత్రి, పక్ష శివరాత్రి, మాస శివరాత్రి, మహాశివరాత్రి, యోగశివరాత్రి. నిత్యశివరాత్రి అంటే ప్రతిరోజూ రాత్రిపూట చేసే శివారాధన. పక్ష శివరాత్రి అంటే ప్రతి పదిహేను రోజులకొకసారి శివార్చన కోసం నిర్దేశించిన రాత్రి. మాసశివరాత్రి అంటే ప్రతి మాసంలోనూ శివపూజకు ఉద్దేశించిన రాత్రి. మిగతా శివరాత్రులు ఏవి కుదిరినా కుదరకపోయినా ఏడాదికొకసారి వచ్చే మహాశివరాత్రినాడు శివపూజ చేయడం పుణ్యప్రదం. తెలిసైనా, తెలియకైనా కొన్ని నీళ్ళు శివలింగం మీద పోసి మరికొన్ని మారేడు దళాలు ఆ శివలింగంమీద పెడితే భోళాశంకరుడు పరవశించి అలా చేసినవారిని అనుగ్రహించిన కథలు ఎన్నెన్నో మన పురాణాల్లో కనిపిస్తున్నాయి.

శివరాత్రినాటి లింగోద్భవ సమయంలో చేసే అభిషేకాలలో కూడా కొన్ని నియమాలున్నాయి. రాత్రి జాగరణం చేస్తూ నాలుగు జాములలోనూ నాలుగు సార్లు నాలుగు రకాలుగా అభిషేకాలు చేస్తుంటారు. మొదటి జాములో పాలతో అభిషేకించి, పద్మాలతో పూజచేసి పెసర పప్పు, బియ్యం కలిపి పులగం వండి శివుడికి నైవేద్యం పెడతారు. రుగ్వేద మంత్ర పఠనం జరుపుతారు. రెండో జాములో పెరుగుతో అభిషేకం, తులసీ దళార్చనచేసి, పాయసం నైవేద్యంపెట్టి యజుర్వేద మంత్రాలను చదువుతారు. మూడోజాములో నేతితో అభిషేకించి, మారేడు దళాలతో అర్చించి, నువ్వుల పొడి కలిపిన తిను బండారాలను నివేదిస్తారు. సామవేద మంత్రపఠన చేస్తారు. నాలుగో జాములో తేనెతో అభిషేకంచేసి నల్ల కలువలతో పూజించి అన్నం నివేదిస్తారు. అధర్వణ వేద మంత్రాలను చదువు తారు. ఇలా అభిషేకాలు చేసే శక్తిలేనివారు అభిషేకం చేసేటప్పుడు శివదర్శనం చేసుకున్నా పుణ్యమే నంటారు. నాలుగో జాము ముగిశాక ఉదయంపూట శివుడిని ఊరేగిస్తారు. ఇలా ఊరేగించడం వెనుక ఓ సామాజిక అంతరార్థం ఉంది. అందుకే భక్తులు శివరాత్రి రోజు అభిషేకం చేసి జాగారం చేయడం ఆనవాయితీగా వస్తోంది. శివుడు మిగతా దేవతలతో పోలిస్తే సులువగా అనుగ్రహం ఇస్తాడని నమ్మిక. శివనామంతో సర్వపాపాలు హరించుకుని పోతాయని అంటారు. అందుకే మనదేశంలో అనే శైవాలయాలు ప్రత్యేకతను సంతరించు కున్నాయి. శివుడు లయకారకుడు. శివారాధకులకు మహాశిరాత్రి పర్వదినం. ఉపవాసం ఈ పండగ ప్రత్యేకత. శివుడు భోళా శంకరుడు కావడంతో అడకుండానే వరాలిచ్చే దేవుడుగా ప్రతీతి. శివరాత్రి రోజు ఉపవాసంతో... రాత్రి అభిషేకించి జాగారం చేస్తే ముక్తి లభిస్తుందని ఆర్యోక్తి. అందుకే శివరాత్రి జాగారాలకు ప్రాధాన్యం ఉంది. ఈశాన సంహిత ప్రకారం శివుడు అర్ధరాత్రి సమయంలో తేజోలింగంగా ఆవిర్భవించాడు. అదే లింగోద్భవ కాలం. మహాశివరాత్రి మాఘమాసం కృష్ణపక్షంలో అర్ధరాత్రి ఉండే చతుర్దశి తిథినాడు వస్తుంది. చతుర్దశి ఈతిథి శివుడికి ఎంతో ప్రీతికరమైంది. అందులోనూ కృష్ణచతుర్దశి అంటే అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి తిథి మరీ ప్రీతికరమైంది. ఆ కారణంగానే ప్రతి మాసంలోనూ వచ్చే కృష్ణచతుర్దశి తిథులు మాసశివరాత్రులుగా ఉంటాయి. సంవత్సరం లోని పన్నెండు శివరాత్రులలో మాఘమాసంలో వచ్చే శివరాత్రి శివుడికి బాగా ఇష్టమైంది కాబట్టి దాన్ని మహాశివరాత్రి అని అంటారు. కాశితో పాటు జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు. వినాయక చవితి, శ్రీరామ నవమి లాంటి పండుగలలో దేవుళ్లను పగటిపూట పూజిస్తారు. శివరాత్రినాడు శివుడిని రాత్రిపూట మాత్రమే పూజించడం, మిగిలిన పండుగలలా పంచభక్ష్య పరమాన్నా లతో కాక ఉపవాస దీక్షతో శివరాత్రి పండుగను జరుపుకోవడం ఓ విశేషం. యోగి అయినవాడు తన యోగబలం చేత యోగనిద్రలోకి వెళ్లే రాత్రిని యోగ శివరాత్రి అని అంటారు. సాధారణంగా రాత్రిపూట దేవీపూజను, పగటిపూట దేవపూజను చేయడం ఒక ఆచారంగా ఉంటుంది. కానీ శివరాత్రి విషయంలో మాత్రం ఇది భిన్నంగా కనిపిస్తుంది. శివరాత్రి రోజున రాత్రిపూటే శివపూజ జరుగుతుంది. ఇలా శివ ఆరాధన రాత్రిపూట జరగడానికి ఓ కారణం కూడా ఉంది. పూర్వం ఓసారి ప్రళయం వచ్చినప్పుడు అంతా కటికచీకటిగా మారిపోయింది. ఆ సమయంలో లోక కల్యాణం కోసం పార్వతీదేవి శివుడిని గురించి తపస్సు చేసింది. ఆనాటి పార్వతి తపస్సు మెచ్చిన శివుడు ఆ చీకటిని పోగొట్టి మళ్లీ మామూలుగా రాత్రి, పగలు ఏర్పడేలా చేశాడు. దాంతో జీవులన్నీ మళ్లీ ఆనందించాయి. తాను చేసినట్లుగా అంత రాత్రివేళ శివుడిని గురించి పూజలు చేసినవారికి సర్వసుఖాలు కలిగేలా అనుగ్రహించమని పార్వతీదేవి శివుడిని ప్రార్థించింది. శివుడు అందుకు అంగీకరించాడు. పార్వతి చేసిన శివపూజకు గుర్తుగా ఆనాటి నుంచి మహాశివరాత్రి పూజా పర్వదినం ఏర్పడింది. ఎవరైనా ఏ కారణం చేతనైనా ఆలయాలకు వెళ్ళి శివదర్శనం చేసుకోలేకపోతే వారికి ఆ ఊరేగింపును చూసి పుణ్యం పొందే భాగ్యం కలుగుతుందని అంటారు.

# శ్రీకాళహస్తిలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

## శివరాత్రి దర్శనాలకు భారీగా ఏర్పాట్లు



**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని వేకువజామున రెండు గంటలకే సర్వదర్శనం ప్రారంభించాలని ముక్కంటి ఆలయాధికారులు నిర్ణయించారు. వేకువజామున ఒంటి గంటలకు లింగోద్భవ దర్శన ఏర్పాట్లు చేయనున్నారు. భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ఇప్పటికీ ప్రధాన ఆలయాన్ని ముచ్చటైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. గోపురాలకు కొత్త రంగులద్దడంతో కళకళలాడుతున్నాయి. భక్తకన్నప్ప, రామసేతు వంతెనలపైనా, పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. అరటిచెట్లు, మామిడాకుల పచ్చతోరణాలు, కాషాయరంగు జెండాలతో వీధులు దర్శనమిస్తున్నాయి. తరలి వచ్చే భక్తుల కోసం ఆలయంలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. చతుర్మాడ వీధులు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికైన ధూర్జటి కళాప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. సన్నిధివీధిలో ఏర్పాటు చేస్తున్న కైలాసం సెట్టింగ్ పనులు జోరందుకున్నాయి. రథాలు, నారద పుష్కరిణిలోని తెప్పలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవ ఏర్పాట్లు ఆలస్యం కావడంతో, ఇప్పటికీ సాంస్కృతిక కార్యక్రమాల షెడ్యూలు ఖరారు కాలేదు. అయితే పలువురు పీఠాధిపతులు, సినీనటులు, గాయకులు, కళాకారులకు ఉత్సవాలకు రావాలని అధికారులు ఆహ్వానం పంపారు. సర్వజగత్తును పరిపాలించే.. సర్వ జగద్రక్షకుడైన సోమస్కంధమూర్తికి.. యాగరక్ష పెట్టాక పురవీధుల్లో ఊరేగింపునకు తీసుకెళ్లడం ఇక్కడి సంప్రదాయంగా వస్తోంది. బ్రహ్మోత్సవ రోజుల్లో ఉత్సవమూర్తులతో నిర్వహించే ఊరేగింపు మహోత్సవానికి ఎంతో ప్రాభవం ఉంటుంది. అందుకే సాధారణ రోజుల వలే కాకుండా.. బ్రహ్మోత్సవ రోజుల్లో.. దేవతామూర్తులు బయటకు వెళ్లాలంటే.. ఆలయంలోని యాగశాల వద్ద నిలిపి యాగరక్ష పెట్టాక మాత్రమే బయటకు తీసుకెళ్లడం సంప్రదాయంగా వస్తోంది. ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవ అలంకరణలు పూర్తయిన శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమ స్కంధమూర్తి ఉత్సవమూర్తులను యాగశాల వద్ద యాగకలశాలకు రోజూ హోమాది కార్య క్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సిద్ధం చేసిన యాగరక్షను ఉత్సవర్లకు అద్దిన తరవాత.. వీళ్లను ఊరేగింపుగా తీసుకెళుంటారు. ఈ విశేషోత్సవాన్ని సందర్శించేందుకు జనం అధిక సంఖ్యలో రావడం విశేషం. ఉత్సవాలను పురస్కరించుకుని గంగాభవానీ సమేత శివయ్య దశకంఠుడిపై పురవిహారం చేస్తాడు.

## నమ్మి ఓట్లేస్తే ప్రజలు, రైతులకు రేవంత్‌రెడ్డి చుక్కలు

### సమస్యలు పట్టించుకునే స్థితిలేని బీజేపీ, కాంగ్రెస్

### రైతుల సమస్యలు పరిష్కరించాలి
### : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**వరంగల్:** కాంగ్రెస్ బూటకపు మాటలను నమ్మి ఓట్లేసి గెలిపిస్తే ప్రజలకు రేవంత్‌రెడ్డి చుక్కలు చూపిస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. ప్రజలు, రైతుల కష్టాలు పట్టించుకునే స్థితిలో అటు బీజేపీగానీ, ఇటు కాంగ్రెస్ గానీ లేదని ఆయన ఆరోపించారు. జిల్లాలోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను దయాకర్‌రావుతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు మిర్చి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. బోగస్ మాటలు మాట్లాడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి.. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకో, అబద్ధాలు మాట్లాడడం మానుకో అని హెచ్చరించారు. రైతు బంధు ఇవ్వలేదు, రుణమాఫీ పూర్తి చేయకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. యూరియా కోసం రైతులు చెప్పులు లైన్లలో పెట్టుకుంటున్నారని విమర్శించారు. మిర్చి రైతును ఆదుకోవాలి, క్వింటాకు 25 వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు రాజుల్లాగా బతికారని గుర్తు చేశారు. రైతులను అన్ని విధాలా ఆదుకున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అని ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు.

# చికెన్‌గున్యా వ్యాక్సిన్ తయారీకి

**హైదరాబాద్:** చికెన్ గున్యా వ్యాధి నివారణ కోసం బయోలాజికల్–ఈఫార్మా బవేరియన్ నార్డిక్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నది. పేద, మధ్య తరగతి ఆదాయం ఉన్న దేశాలకు.. చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను అందించాలన్న ఉద్దేశంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. బవేరియన్ కంపెనీతో కుదిరిన వ్యూహా త్మక ఒప్పందంపై .. హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్ కంపెనీ పత్రికా ప్రకటనలో పేర్కొ న్నది. ఒప్పందంలో భాగంగా తొలుత టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ జరగనున్నది. ఆ తర్వాత వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రక్రియ జరుగుతుంది. దిగువ, మధ్య ఆదాయ దేశాలకు వ్యాక్సిన్ సరఫరా చేయాలన్న టార్గెట్‌తో రెండు ఫార్మాల కంపెనీలు డీల్ చేసుకున్నాయి. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ తర్వాత.. రెగ్యులేటరీ ఆమోదం కోసం కంపెనీ ప్రయత్నించనున్నది. ఆ తర్వాత కమర్షియల్‌గా చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో ఉన్న ఉత్పత్తి కేంద్రంలోనే వ్యాక్సిన్ తయారీ జరగనున్నది. బయోలాజికల్–ఈ సంస్థ దీని ద్వారా కొత్తగా 300 కొత్త ఉద్యోగాలను కల్పించనున్నది. చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను ప్రపంచ దేశాలకు అందించాలన్న ఉద్దేశంతో ప్రాజెక్టును చేపట్టినట్లు బీఈ వెల్లడించింది. అమెరికాలో చికున్ గునియా వ్యాక్సిన్‌కు ఆమోదం దక్కింది. 12 ఏళ్ల వయసు పిల్లలు కూడా అక్కడ ఆ వ్యాక్సిన్ ఇస్తున్నారు. బవేరియన్ నార్డిక్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉన్నట్లు బయోలాజికల్ ఈ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహిమా ధాట్ల తెలిపారు. దిగువ, మధ్య ఆదాయ దేశాల ప్రజలకు చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. వ్యాక్సిన్ ఉత్పత్తి విధానం, సక్సెస్‌ఫుల్ ట్రాక్ రికార్డు వల్ల.. బవేరియన్ నార్డిక్ కంపెనీతో ఒప్పందం కుదర్చినట్లు ఆమె తెలిపారు. తమ కంపెనీ వద్ద ఉన్న అడ్వాన్స్‌డ్, నిష్ణాత తయారీ టెక్నాలజీతో.. పేద దేశాల ప్రజలకు వ్యాక్సిన్‌ను అందించనున్నట్లు ఆమె వెల్లడించారు. తమ ప్రయత్నం ద్వారా ప్రపంచవ్యాప్తంగా చికెన్ గున్యా వ్యాధి నియంత్రణలోకి వస్తుందని, తద్వారా ప్రజా ఆరోగ్య వ్యవస్థ బలపడుతుందని ఆశిస్తున్నట్లు మహిమ పేర్కొన్నారు.

# చారిత్రక ఘట్టంగా మహాకుంభమేళా

భారతదేశంలో మహోజ్వల ఘట్టం ముగింపు దశకు చేరుకుంది. 144 ఏళ్లకోమారు వచ్చే మహాకుంభమేళా మహాశివరాత్రి పర్వదినంతో ముగియనుంది. ఇప్పటికే 65కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి నట్లు యూపి ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి. శివరాత్రి బుధవారం మరింతమంది చేరితే అసలు లెక్కలు తేలుతాయి. అయితే పవిత్ర స్నానాలు ఆచరించిన వారి సంఖ్యను చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఈ జనాభా భారత జనాభాకు సగంగా ఉండడం విశేషం. దేశవిదేశాల నుంచి కూడా కోట్లాది సంఖ్యలో భక్తులు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు, సిఎ యోగి ఆదిత్యనాథ్, ఎపి మంత్రులు పవన్ కళ్యాణ్, లోకేవ్ దంపతులు ఇలా ఒక్కరేమిటి ఎందరో విఐపిలు పుణ్యస్నానాలు ఆచరించారు. స్వల్ప ఘటనలు మినహా ఓ రకంగా కుంభమేళా అద్భుతంగా సాగిందనే చెప్పాలి. మౌని అమావాస్య రోజు జరిగిన తొక్కిసలాట ఒక్కటే కొంత ఆందోళనకు గురిచేసింది. రెండుమూడు చిన్నచిన్న ఘటనలు..అంటే స్వల్ప అగ్నిప్రమాదాల్లాంటివి జరిగాయి. ఇవి మినహా అంతా ప్రశాంతంగా ముగిసింది. ఇందుకు యూపి ప్రభుత్వాన్ని అభినందించ చాల్సిందే. దాదాపు రెండేళ్ల ముందునుంచే ఈ మహాఘట్టం కోసం ఏర్పాట్లు మొదలయ్యాయంటే .. ఎంతగా జాగ్రత్తలు తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా ఇక చివరిదశకు చేరింది. ఇవరాత్రి పర్వదిన స్నానాలతో ఈ మహాకుంభమేళా ముగియనుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివెళు తున్నారు. చివరి అమృత్ స్నానం కోసం కోటి మందికిపైగా భక్తులు వస్తారని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రయాగ్‌రాజ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించింది.



భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్టం చేశారు. భక్తుల స్నానాలకు ఇబ్బందులు లేకుండా తొక్కిసలాటకు అవకాశం లేకుండా గట్టి ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి కుంభమేళా ప్రాంతాన్ని 'నో వెహికల్ జోన్' గా అధికారులు ప్రకటించారు. ప్రయాగ్‌రాజ్ మొత్తం ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. అత్యవసర, నిత్యావసర సర్వీసులకు చెందిన వాహనాలను మాత్రమే అనుమతించనున్నట్లు ప్రకటించారు. యాత్రికులంతా ఈ మార్గదర్శకాలను పాటించాలని, అధికారులకు సహకరించాలని ప్రభుత్వం కోరింది. చివరి రోజు అమృత స్నానాల కోసం కోటి మందికిపైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుంభమేళా ప్రాంతంలో రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా లక్నో, ప్రతాప్‌గఢ్ వైపు నుంచి వచ్చే యాత్రికుల కోసం ఫాఫామౌ ఘాట్‌ను నియమించారు. రేవాన్, బందా, చిత్రకూట్, మిర్జాపూర్ వైపు నుంచి వచ్చే వారికోసం ఆరైల్ ఘాట్‌ను రిజర్వ్ చేశారు. కౌశాంబి నుంచి వచ్చే భక్తుల కోసం సంగం ఘాట్‌ను కేటాయించారు. మరోవైపు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే అన్ని ప్రధాన రహదారుల్లో పోలీసులు భారీగా మోహరించారు. వాహనాలు సాఫీగా ముందుకు సాగేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే.. 40 పోలీసు బృందాలు మోటార్‌బైక్‌లపై ఆయా మార్గాల్లో మోహరించారు. ప్రయాగ్‌రాజ్‌ను కలిపే ఏడు ప్రధాన రహదారుల్లో అదనపు డైరెక్టర్ జనరల్, ఇన్‌స్పెక్టర్ జనరల్ స్థాయి అధికారులు విధుల్లో ఉండనున్నారు. కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ప్రారంభమైన ఈ మహాకుంభమేళా.. ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగియనుంది. దాదాపు 45 రోజుల పాటు సాగే ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివస్తున్నారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమం (÷సతిలÛనితి ÷ూజీనిణజీప)లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 64 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమంలో స్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కార్ ప్రకటించింది. ఇక చివరి రోజు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఇదే సమయంలో గిన్నిస్ రికార్డు లక్ష్యంగా పారిశుధ్య కార్మికులు కుంభమేళా ప్రాంతంలో క్లీన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 15,000 మంది పారిశుధ్య కార్మికులు ఇక్కడ నాలుగు జోన్లలో క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా చీపురుపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు, ప్రయాగ్‌రాజ్ మేయర్ గణేశ్ కేసర్వాని, మహాకుంభ్ ప్రత్యేక ఈవో ఆకాంక్ష రాణా పర్యవేక్షించారు. ఈ రికార్డుకు సంబంధించిన వివరాలను మూడు రోజుల్లో వెల్లడించనున్నట్లు గిన్నిస్ రికార్డు ప్రతినిధులు తెలిపారు. 2019లో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళా లో 10 వేల మంది పారిశుధ్య కార్మికులు పాల్గొని గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ రికార్డును బ్రేక్ చేయబోతున్నారు. పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ప్రారంభమైన ఈ మహాకుంభమేళా.. ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగియ నుంది. దాదాపు 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివచ్చారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 63 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమ స్నానం ఆచరించారు. శివరిత్రి చివరిరోజుతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. మొత్తంగా మహాకుంభ మేళాతో ప్రపంచం దృష్టిని భారత్ ఆకర్శించిందనడంలో సందేహం లేదు.

# కోటప్పకొండలో శివరాత్ర సందడి

## ప్రభలతో కొండకు చేరుకున్న భక్తులు

## దక్షిణామూర్తిగా విరాజిల్లుతున్న స్వామి

**గుంటూరు:** కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకుంది. కోటయ్య స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటయ్య తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం శివరాత్రి దర్శనాలకు భారీగా ఏర్పాట్లు చేశారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ స్తంభించకుండా పోలీసు శాఖ చర్యలు తీసుకుంది. ప్రభుత్వం తరపున ఏటా తిరునాళ్ల రోజున పట్టు వస్త్రాలను అందజేస్తారు. సంప్రదాయానికి అనుగుణంగా ఈ ఏడాది స్వామికి ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలను దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమర్పించనున్నారు. తెల్లవారు జాము నుంచే వేలాదిగా భక్తులు కోటప్పకొండకు తరలి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహాశివరాత్రి రోజున శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొక్కుబడి ప్రభలతో భక్తులు కొండకు తరలివచ్చారు. నరసరావుపేట నుంచి చిన్నారులు కాలి నడకన ప్రభలతో కోటయ్య సన్నిధికి చేరుకున్నారు. శీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైనలను ఏర్పాటు చేశారు.



ఉచిత దర్శనం క్యూలైనలో భక్తుల రద్దీ నెలకుంది. నరసరావుపేట పురపాలక సంఘం ప్రభ కోటప్పకొండకు చేరుకుంది. కొండ దిగువన తలనీలాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో రామ కోటిరెడ్డి, పాలక మండలి చైర్మన రామక్రిష్ణ కొండలరావు దేవస్థానం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోటప్పకొండ తిరుణాళ్లకు రాష్ట్ర పండుగ హోదా ఉండటంతో ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. నరసరావుపేట డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను కోటప్ప కొండకు నిర్వహిస్తున్నది. తిరునాళ్ళ రోజున నరసరావుపేట, చిలకలూరిపేట డిపోల నుంచి బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. దక్షయజ్ఞం అనంతరం ఈశ్వరుడు సతీ వియోగంతో ప్రశాంతత కోసం త్రికూటాద్రి (కోటప్పకొండ) పర్వతం పైన 12 ఏళ్లు వటుడిగా తపమాచరిస్తుండగా, సదాశివుని అనుగ్రహం కోసం బ్రహ్మ, విష్ణు, సకల దేవతలు, రుషి పుంగవులు స్వామి కటాక్షం కోసం అక్కడ తపమాచరించి ప్రసన్నుడిగా స్వామిని దర్శించుకుని జ్ఞాన దీక్ష పొందారు. అందు వల్లే ఈ క్షేత్రం మహాపుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. బ్రహ్మచారి అయిన దక్షణామూర్తి క్షేత్రం కావడంతో ఇక్కడ కళ్యాణోత్సవాలు నిర్వహించరు. ధ్వజ స్తంభం కూడా ఉండదు. ఎటువైపు చూసినా మూడు శిఖరాలుగా కోటప్పకొండ కన్పిస్తుంది. అందుకే కొండపై వెలసిన స్వామికి త్రికూటేశ్వరుడు అని పేరు వచ్చింది. ఈ మూడు శిఖరాలకు బ్రహ్మ, విష్ణు, రుద్ర శిఖరాలు అని పిలుస్తారు. బ్రహ్మ శిఖరంపై బ్రహ్మ నివసించాడని ప్రతీతి. జ్యోతిర్లింగం ఈ ప్రాంతంలో లేకపోవటంతో బ్రహ్మ ఈశ్వరుని గురించి తపస్సు చేయగా అప్పుడు స్వామి ప్రత్యక్షమై బ్రహ్మ కోరిక తీర్చుటకు జ్యోతిర్లింగంగా వెలిశాడు. ఆ జ్యోతిర్లింగమే భక్తుల పూజలందు కుంటున్న కోటేశ్వర లింగం. కోటప్పకొండ వద్ద ఉన్న కొండకావూరులోని గొల్లభామ ఆనందవల్లి త్రికోటేశ్వరునికి పూజలు చేయగా ఈశ్వరుడు జంగందేవర రూపంలో ప్రత్యక్షమైనట్టు స్థల పురాణం చెపుతోంది. ఆనందవల్లి పాప వినాచన దూన వద్దకు వెళ్లి తీర్థం రుద్ర శిఖరానికి తెచ్చి జంగమయ్యకు అభిషేకాధిపూజలు చేసింది. ఆమెను పరీక్షించేం దుకు ఎన్ని విధాలా కష్ట పెడుతున్నప్పటికీ పూజలు మాననం దునే ఆనందవల్లి ఇంటికి వస్తాను, అక్కడే వ్రతం ఆచరించమని జంగమయ్య ఆమె వెనుకనే బయలుదేరాడు. ఎలాంటి పరిస్థితుల్లోను వెను దిరిగి చూడవద్దని చెప్పగా ప్రళయ ధ్వనులకు తాళలేక బ్రహ్మశిఖరం వద్ద వెను దిరిగి చూసింది. జంగమయ్య అక్కడే శిలగా మారాడు. ఆ చోటనే కోటేశ్వరాలయం నిర్మించ బడింది. ఈ ఆలయానికి దిగువ భాగాన గొల్లభామ శిలగా మారిన ప్రాంతంలో ఆనందవల్లి గుడి నిర్మించారు. విష్ణుశిఖరంలో దక్ష యజ్ఞంలో పాల్గొన్న దేవతలు, రుషులు పాప విమోచనం పొందిన పవిత్ర స్థలంలో పాప విమోచనేశ్వర స్వామి ఆలయం ఉంది. ఆరు వందల అడుగుల ఎత్తులో త్రికోటేశ్వర స్వామి దేవాలయం ఉంది. ఘాట్ రోడ్డు నిర్మాణంతో ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య నానాటికి పెరుగు తోంది. చారిత్రక త్రికోటేశ్వర ఆలయం క్రీస్తు శకం 1172 నాటికే ప్రసిద్ధి చెందినట్లు వెలనాటి చోళ రాజైన కుళొత్తుంగా చోళరాజు, సామంతుడు మురంగినాయుడు వేయించిన శాసనాల ద్వారా తెలుస్తోంది.

# ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన శైవక్షేత్రాలు

**కరీంనగర్:** మహాశివరాత్రి వేడుకలకు రాజన్న జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివరాత్రి సందర్భంగా శివభక్తులు భక్తి శ్రద్ధలతో గండదీపాన్ని వెలిగించి పరవశించి పోతారు. జిల్లాలోని శివాలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. స్వయంభూ దేవస్థానాలు, పురతాన ఆలయాల్లో శివరాత్రి వేడుకలు సోమవారం ప్రారంభంకానున్నాయి. మంగళ, బుధ వారాల్లో కొనసాగనున్నాయి. మంగళవారం మహాశివరాత్రి వేడుకలను జరుపుకోనున్నారు. జిల్లాలో దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి లక్షలాది మంది భక్తులు తరలిరావడం మొదలైంది. శివాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. ధర్మపురి శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలోమహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని స్వామి వారలకు అభిషేకం,




మహాలింగార్చన, కల్యాణం పూజాది కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేయించి నట్లు ఆయన వివరించారు. విద్యుత్ దీపాలతో అలంకరణ చేయించి, భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, మంచి నీటి వసతి కల్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శివరాత్రి సందర్భంగా ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు భక్తుల అభి షేకాలు, దర్శనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 వరకు మహాలింగార్చ న, రాత్రి 11 నుంచి ఒంటి గంట వరకు లింగోద్భవ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాత్రి 1 నుంచి 3 వరకు శివకళ్యాణం, ప్రాత:కాలం 3 నుంచి 4 వరకు రథోత్సవం ఉంటుందని వివరించారు. అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయంలోనూ శివరాత్రి ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. టెంట్లు, మంచి నీటి వసతులు కల్పించారు. అలాగే గోదావరితీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సారంగాపూర్ మండలం పెంబట్ల, కోనాపూర్ లోని దుబ్బరాజన్న జాతర బ్రహోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి సన్నిధిలో పుణ్యహావచన, అంకురార్పణ కార్య క్రమాలను నిర్వహిం చారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

## శివరాత్రి ఉత్సావాలకు ఏడుపాయల సిద్ధం

### భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

**మెదక్:** ఏడుపాయల జాతర ఏటా మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు వైభవంగా జరుగనుంది. శివరాత్రి కోసం ఇక్కడికి వేలాదిగా భక్తులు రానున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల జాతరకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఇక్కడికి వేలాదిగా భక్తులు తరలి రానుండడంతో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుగతాయి. ఏటా మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయలలో జాతర కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఈ జాతరను ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తోంది. మహాశివరాత్రి మరుసటి రోజు సంప్రదాయం ప్రకారం వందకుపైగా ఎద్దుల బండ్లు, గుమ్మటాల బండ్లను జాతర ప్రాంగణంలో వూరేగిస్తారు. ఈ బండ్ల వూరేగింపు రసరమ్యంగా సాగుతుంది. మూడో రోజు రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. రాష్ట్ర ఉత్సవం కావడం, లక్షలాదిగా భక్తులు తరలిరానుండడాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. గలగలపారే మంజీరా నదీ పాయల్లో పుణ్యస్నానాలు చేసి, కోరిన కోర్కెలు తీర్చే శక్తిగా కీర్తించే వనదుర్గా మాతను దర్శించుకుని తరిస్తారు. ఏడుపాయలలోని ఆలయం ఏడాది పొడుగునా నిత్యం దీపధూప నైవేద్యాలతో అలరారుతోంది. మంజీరా ఏడుపాయల్లో ఓ పాయ ఒడ్డున రాతిగుహలో వనదుర్గామాత కొలువై ఉంది. , కొట్టొచ్చినట్టుండే అమ్మవారి రూపం ఆకట్టు కుంటుంది. భక్తుల సౌకర్యార్థం జాతర ప్రాంగణంలో మొత్తం పది చోట్ల జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడాన్ని దృష్టిలో ఉంచుకుని జాతర ప్రాంగణంలో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేసారు. లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ప్రాంగణంలో పరిశుభ్రత నెలకొల్పేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఉండేందుకు చెత్తకుండీలు ఏర్పాటు చేసారు.

## శివరాత్రికి ముస్తాబైన కాళేశ్వరం

**జయశంకర్ భూపాలపల్లి:** త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన శైవ పుణ్యక్షేత్రం కాళేశ్వరం. కాశీలో మరణిస్తే ముక్తి.. గోదావరి ఒడ్డున ఉన్న కాళేశ్వరుణ్ని దర్శిస్తే ముక్తి ... అనే నానుడి ఉంది. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంగానూ దీనికి గుర్తింపు ఉంది. యముడు, శివుడు ఒకే పానమట్టంపై ఇక్కడ పూజలు అందు కుంటారు. ఇద్దరమూ భక్తులకు ఆరాధ్యులమవుతామని పరమేష్టి యమధర్మరాజుకు చెప్పాడట. అలా ఇది కాళేశ్వరమయింది. మహదేవపూర్ మండలంలో ఉన్న ఈ పుణ్య క్షేత్రానికి తెలుగు రాష్ట్రలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి భక్తులు తరలివస్తారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఒకే పానపట్టంపై రెండు లింగాలు ఉండటం విశేషం. భక్తులకు ఎలాంటి అసౌర్యాలు కలగనీయకుండా అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. ఏ శాఖ నిర్వర్తించాల్సిన విధులు ఆ శాఖ ఆధ్వర్యంలో కొనసాగేలా జయశంకర్ జిల్లా సంయుక్త పాలనాధికారి అమయ్‌కుమార్ దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి ఈసారి వచ్చే భక్తుల సంఖ్య రెండు లక్షలు దాటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ప్రసాదం విషయంలో కొరత లేకుండా భారీ సంఖ్యలో లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీని చేపట్టారు. మహిళలు, పురుషులు ప్రత్యేకంగా ప్రసాదాన్ని కొనుగోలు చేసే విధంగా కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. శివరాత్రి ఉత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం నాలుగు గంటలకు శివపార్వతుల కల్యాణం జరుగుతుంది. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే పుట్టమధు దంపతులతో పాటు స్థానిక ప్రజాప్రతినిదులు పాల్గొంటారు. శివరాత్రి సందర్భంగా అధికంగా భక్తులు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తారు. స్థానిక బ్రహ్మణోత్తములను రెండు రోజుల పాటు విధుల్లోకి తీసుకోనున్నారు. శివరాత్రికి అనేక మంది భక్తులు జాగారణ ఉంటారు. ఈ నేపథ్యంలో హరికథ, కూచిపూడి నృత్యం, భజన సంకీర్తనలు తెల్లవారు జాము వరకు ఉంటాయి. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను విద్యుత్తుతో అలంకరిస్తున్నారు.

## ఉమ్మడి జిల్లాలో శివాలయాలు ముస్తాబు

**ఆదిలాబాద్:** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి తీరంతో పాటు ఆలయాలను ముస్తాబు చేసారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గోదావరి తీరంలో ఏర్పాట్లను స్థానికనేతలు పరిశీలించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గోదావరి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు అల్పాహారం, తాగు నీటి సదుపాయం కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. వేలాలలో నిర్వహించే జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శివరాత్రికి ఒక రోజు ముందుగానే భక్తులు గుట్టపైకి చేరుకుని అర్ధరాత్రి నుంచి దర్శనం కోసం బారులు తీరుతారు. శివరాత్రి రోజు గుట్టపైన జాతర జరుగుతుంది. గుట్టపైకి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. జాతరకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి సుమారు 2 లక్షల మంది వరకు భక్తులు వస్తారు. గోదావరిఖని, మంచిర్యాల డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు నడిపిస్తారు. గుట్టపైన, కింద తాగునీటి వసతి కల్పిస్తున్నారు. గోదావరి స్నానఘట్టాల వద్ద సింగరేణి రెస్క్యూటీం, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసున్నారు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కన్నాలలో గల బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. జిల్లా ప్రజలతో పాటు కుమరంభీంఆసిఫాబాద్, ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, మహారాష్ట్ర నుంచి జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్‌లతోపాటు మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు నిలిపేందుకు స్థలాన్ని కేటాయించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరి తీర హనుమాన్ ఆలయం, పట్టణంలోని శివాలయంతోపాటు పలు ఆల యాలు ముస్తాబయ్యాయి. పంచకోశ ఉత్తరవాహిని గోదావరి నది తీరాన భక్తుల సౌకర్యార్థం మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేస్తున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పుర స్కరించుకుని కాగజ్‌నగర్ మండలం ఈసుగాం శివమల్లన్న ఆల యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆల యానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలకరించారు. మహా శివరాత్రి రోజు ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాశివరాత్రి పర్వదినం సంద ర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శివాలయాన్ని ముస్తాబు చేశారు.




## అనుకున్నదానికంటే.. అద్భుతం: చాట్‌జీపీటీ రెజ్యూమె

అన్ని రంగాల్లోనూ చాట్‌జీపీటీ హవా కొనసాగుతోంది. ఏ ప్రశ్నకైనా తనదైన రీతిలో సమాధానం చెప్పే చాట్‌బాట్.. ఉద్యోగానికి అవసరమైన రెజ్యూమె కూడా రూపొందిస్తుంది. ఇలా ప్రిపేర్ చేసుకున్న రెజ్యూమెతో లెక్కలేనన్ని ఇంటర్వ్యూ కాల్స్ వస్తున్నాయని ఓ నెటిజన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట్లో వైరల్ అవుతోంది. ఉద్యోగాలకు అప్లై చేసుకోవడానికి నేను చాట్‌జీపీటీని ఉపయోగించాను. నేను ఎలాంటి ఉద్యోగానికి అప్లై చేయాలనుకుంటున్నానో.. దానికి సరిపోయేలా చాట్‌జీపీటీ ద్వారా ఒక రెజ్యూమె రూపొందించుకున్నాను. మొత్తం మీద ఇంటర్వ్యూ చేసేవారిని ఆకట్టుకునేలా డిజైన్ చేసుకున్నాను. ఇది నేను అనుకున్న దాని కంటే చాలా అద్భుతంగా ఉంది. నా రెజ్యూమె చూసి.. చాలా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ కాల్స్ వస్తున్నాయి. నిజం చెప్పాలంటే నా స్థాయికంటే ఎక్కువ ఉద్యోగాలకు సంబంధించిన కాల్స్ వచ్చాయి. అయితే వచ్చిన సమస్య ఏమిటంటే.. నేను ఇంటర్వ్యూ అంటే భయపడతాను. అయితే ఇప్పుడు గందరగోళానికి గురయ్యాను అని పోస్టులో పేర్కొన్నాడు. ప్రస్తుతం ఈ పోస్టుపై పలువురు నెటిజన్లు స్పందిస్తున్నారు. నేను కూడా చాట్‌జీపీటీ సాయంతో రెజ్యూమె క్రియేట్ చేసుకున్నాను అని ఒక వ్యక్తి అన్నారు. చాట్‌జీపీటీని మాత్రమే ఉపయోగించి ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవడం సాధ్యం కాదని నేను అనుకుంటున్నానని మరొక వ్యక్తి అన్నారు. అవసరమైన సమాచారం కోసం చాట్‌జీపీటీ చాలా ఉపయోగపడుతుందని మూడో వ్యక్తి అన్నారు.



## రూ.21.78 లక్షల కొత్త డుకాటి బైక్ ఇదే..

డుకాటి భారతదేశంలో 'డెజర్ట్‌ఎక్స్ డిస్కవరీ'ని లాంచ్ చేసింది. దీని ధర రూ. 21.78 లక్షలు (ఎక్స్-షోరూమ్). ఇది దాని మునుపటి అన్ని మోడల్స్ కంటే కూడా భిన్నంగా ఉంది. అయితే అడ్వెంచర్ చేయడానికి మాత్రం అద్భుతంగా ఉంది. ఈ బైక్ స్టాండర్డ్, ర్యాలీ వేరియంట్లలో కూడా అందుబాటులో ఉంది. స్టాండర్డ్ డెజర్ట్‌ఎక్స్ ధర రూ. 18.33 లక్షలు కాగా, డెజర్ట్‌ఎక్స్ ర్యాలీ ధర రూ. 23.70 లక్షలు. డెజర్ట్‌ఎక్స్ డిస్కవరీ.. పెద్ద విండ్‌షీల్డ్, ప్యానియర్‌లు, ఇంజిన్, బాడీవర్క్ ప్రొటెక్షన్, సమ్ గార్డ్, రేడియేటర్ గ్రిల్ పొందుతుంది. అంతే కాకుండా ఈ బైక్ హీటెడ్ గ్రిప్‌లు, సెంటర్ స్టాండ్ వంటివి కూడా పొందుతుంది. డుకాటి డెజర్ట్‌ఎక్స్ డిస్కవరీ.. 937 సీసీ ఎల్-ట్విన్ ఇంజిన్ పొందుతుంది. ఇది 9250 rpm వద్ద, 108 Bhp పవర్, 6500 rpm వద్ద 92 Nm టార్క్ అందిస్తుంది. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్‌తో జత చేయబడి.. మంచి పర్ఫామెన్స్ అందిస్తుంది. ఈ బైక్ ఫ్యూయెల్ ట్యాంక్ కెపాసిటీ 21 లీటర్లు. కంపెనీ ఈ బైక్ కోసం బుకింగ్స్ స్వీకరించడం కూడా ప్రారంభించింది.

## ఎన్నోఏళ్ల కల నెరవేరబోతున్న వేళ..

### మార్చి 1 నుంచే కొత్త రేషన్‌కార్డులు

### లక్ష కార్డులు పంపిణీ చేయనున్న అధికారులు

**హైదరాబాద్:** ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్తను అందించింది. గత పదేళ్లకు పైగా అన్ని అర్హతలు ఉన్న తెల్లరేషన్‌కార్డు లేకపోవడంతో అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు మార్చి ఒకటి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రకటించింది. మార్చి ఒకటిన ఒకే రోజు లక్ష కార్డులు జారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో లక్ష కార్డులను అధికారులు పంపిణీ చేయనున్నారు. కొత్త జిల్లాల ప్రకారం.. హైదరాబాద్- 285, వికారాబాద్ జిల్లా- 22 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లా- 15 వేలు, నారాయణపేట జిల్లా- 12 వేలు, వనపర్తి జిల్లా- 6 వేలు, మహబూబ్‌నగర్ జిల్లా- 13 వేలు, గద్వాల్ జిల్లా- 13 వేలు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా- 6 వేలు, రంగారెడ్డి జిల్లా- 24 వేలు చొప్పున లక్ష కార్డులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మార్చి 8 తర్వాత అన్ని జిల్లాల్లో పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. కాగా, 2014 నుంచి తెలంగాణలో నూతన రేషన్ కార్డులు జారీ చేయలేదు. ఈ పదేళ్లలో లక్షల మంది వివాహాలు చేసుకుని వేరుకాపురాలు పెట్టారు. ప్రభుత్వ పథకాలు ఏమైనా అందాలంటే రేషన్ కార్డులు కీలకం. కార్డులు లేక అనేక మంది సంక్షేమ పథకాలను కోల్పోయిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు నూతన కార్డులు జారీ చేస్తున్నట్లు తీపి కబురు చెప్పింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది జనవరి 26న కూడా 16,900 కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేశారు. మరోసారి ఈ ప్రక్రియ చేపట్టి మరికొన్ని కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రజాపాలన, గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు.. తాజాగా మీ సేవా కేంద్రాల ద్వారా కూడా అప్లికేషన్లు తీసుకుంటున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం అర్హులకు నూతన కార్డులను మంజూరు చేయనున్నారు.

# రూ.26 లక్షల కోట్ల నిల్వలపై మౌనం వీడిన వారెన్ బఫెట్

బెర్క్ షైర్ హాత్వే ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ సీఈఓ వారెన్ బఫెట్ ఎట్టకేలకు కంపెనీ వద్ద పోగైన 321 బిలియన్ డాలర్ల(సుమారు రూ.26 లక్షల కోట్లు) నగదు నిల్వలకు సంబంధించిన విషయాలు పంచుకున్నారు. బఫెట్ తన పెట్టుబడి వ్యూహాన్ని, తాను లక్ష్యంగా పెట్టుకోవాలనుకుంటున్న రంగాలను వివరిస్తూ షేర్ హెూల్డర్లకు తాజాగా వార్షిక లేఖ విడుదల చేశారు. బెర్క్ షైర్ హాత్వే నగదు, ట్రెజరీ బిల్లు హెూల్డింగ్స్ ఆల్ టైమ్ గరిష్టానికి చేరాయి. ఇది బఫెట్ పెట్టుబడి వ్యూహం, మార్కెట్ దృక్పథంపై ప్రశ్నలను లేవనెత్తింది. గత కొన్ని త్రైమాసికాలుగా బెర్క్ షైర్ ఈక్విటీ సెక్యూరిటీలను బారీగా అమ్ముతూ వచ్చింది. దాంతో కంపెనీ వద్ద దాదాపు 321 బిలియన్ డాలర్ల(సుమారు రూ.26 లక్షల కోట్లు) మొత్తం సమకూరింది. టాప్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ఇలా భారీగా అమ్మకాలు చేపట్టడం వెనుక గల కారణాలపై ఊహాగానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లో అధిక వాల్యుయేషన్లు, ఆకర్షణీయమైన పెట్టుబడి అవకాశాలను కనుగొనడం సవాలుగా



మారాయని బఫెట్ స్పష్టత ఇచ్చారు.

**వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికలు**

బెర్క్ షైర్ హాత్వే పెట్టుబడి విధానం ఎల్లప్పుడూ మంచి వ్యాపారాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయడంపై కేంద్రీకృతమై ఉంటుందని బఫెట్ తెలిపారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులతో సరైన అవకాశాల కోసం ఓపికగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. బెర్క్ షైర్ నగదు నిల్వలను ఇన్వెస్ట్ చేయాలని చూస్తున్న కొన్ని విభాగాలు కింది విధంగా ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడులు: ఈ విభాగంలో ఇటీవల స్టాక్ అమ్మకాలు ఉన్నప్పటికీ బఫెట్ స్థిర ఆదాయ పెట్టుబడుల కంటే ఈక్విటీలపై నమ్మకంగా ఉన్నట్లు తెలిపారు. బెర్క్ షైర్ మెరుగైన నియంత్రిత యాజమాన్యంలోని వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టేందుకు ప్రాధాన్యత ఇస్తుందని నొక్కి చెప్పారు. జపాన్ మార్కెట్‌పై ఆసక్తి: సంస్థ వద్ద ఉన్న నగదులో కొంత బఫెట్ జపాన్‌లోని ఐదు అతిపెద్ద వాణిజ్య సంస్థలైన ఇటోచు, మరుబెని, మిత్సుబిషి, మిత్సుయి, సుమిటోమోల్లో పెట్టుబడి పెంచాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఆయా కంపెనీల్లో బెర్క్ షైర్ హాత్వే ఇన్వెస్ట్ చేసింది.

**అమెరికా కంపెనీలు:**

బఫెట్ అధిక వాల్యుయేషన్ల విషయంలో అప్రమత్తంగా ఉన్నప్పటికీ తన పెట్టుబడి ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న యూఎస్ కంపెనీలను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. బెర్క్ షైర్ డీర్, యునైటెడ్ పార్సిల్ సర్వీస్, సీవీఎస్ హెల్త్ వంటి కంపెనీల్లో కొనుగోళ్లను పరిగణిస్తున్నట్లు తెలిపింది. ట్రెజరీ బిల్లులు: బెర్క్ షైర్ స్టాక్ అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని యూఎస్ ట్రెజరీ బిల్లుల్లో తిరిగి పెట్టుబడి పెడుతోంది. ఈ వ్యూహం మరింత ఆకర్షణీయమైన పెట్టుబడి అవకాశాల కోసం లిక్విడిటీ రాబడిని అందిస్తుంది.

**సహనం ప్రాముఖ్యత**

బఫెట్ ఇన్వెస్ట్‌మెంట్ విధానం పెట్టుబడిలో సహనం, క్రమశిక్షణ ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. ఇన్వెస్ట్ చేసిన తర్వాత ఓపిగ్గా వేచి చూస్తే తప్పకుండా మంచి రాబడులు అందుకోవచ్చని బఫెట్ నిరూపించారు. తక్కువ రిస్క్, గణనీయమైన రాబడిని అందించే అవకాశాల కోసం ఎదురుచూస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ వైఖరి చాలా సంవత్సరాలుగా బెర్క్ షైర్‌కు బాగా ఉపయోగపడింది. ఇది మార్కెట్ తిరోగమనాన్ని కూడా అవకాశంగా మలుచుకునేందుకు తోడ్పడింది.

# తక్కువ ధర.. ఎక్కువ సేఫ్టీ ఫీచర్స్: ఇదిగో బెస్ట్ కార్లు










తక్కువ ధరలో.. ఎక్కువ ఫీచర్స్, మంచి డిజైన్ కలిగిన కార్లను కొనుగోలు చేయాలనుకునే వారు.. భద్రతకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగానే దాదాపు ఎక్కువ సేఫ్టీ ఫీచర్స్ ఉన్న కార్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ కథనంలో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు కలిగిన బెస్ట్ కార్ల గురించి తెలుసుకుందాం.

**మారుతి సుజుకి సెలెరియో**

ప్రారంభంలో సెలెరియో కారులో మారుతి సుజుకి కేవలం రెండు ఎయిర్‌బ్యాగ్‌లను మాత్రమే అందించింది. ఆ తరువాత కాలంలో ఈ హ్యాచ్‌బ్యాక్‌లో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు అందించడం మొదలు పెట్టింది. అయితే ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు ఉన్న కారు ధర.. స్టాండర్డ్ వేరియంట్ ధర కంటే కొంత ఎక్కువ. ఈ కారు ధరలు రూ. 5.64 లక్షల నుంచి రూ. 7.37 లక్షల మధ్య ఉన్నాయి.

**హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్**

హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ కారులో కూడా కంపెనీ ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను అందిస్తోంది. ఎయిర్‌బ్యాగ్‌లు మాత్రమే కాకుండా.. ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, రియర్ పార్కింగ్ కెమెరా, హిల్ అసిస్ట్ కంట్రోల్ వంటి ఫీచర్స్ కూడా ఉందులో ఉన్నాయి. ఈ కారు ధరలు రూ. 5.98 లక్షల నుంచి రూ. 8.38 లక్షలు. ఇది 1.2 లీటర్ గ్యాసోలిన్ ఇంజిన్ ద్వారా 82 హార్స్ పవర్, 113.8 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది.

**నిస్సాన్ మాగ్నైట్**

మార్కెట్లో ఎక్కువ అమ్ముడవుతున్న కార్ల జాబితాలో నిస్సాన్ మాగ్నైట్ ఒకటి. రూ. 6.12 లక్షల నుంచి రూ. 11.72 లక్షల మధ్య ధరలో అందుబాటులో ఉన్న ఈ కారు ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో పాటు.. 360 డిగ్రీ కెమెరా, హిల్ స్టార్ట్ అసిస్ట్, ట్రాక్షన్ కంట్రోల్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఏబీఎస్ విత్ ఈబీడీ, త్రీ పాయింట్ సీట్ బెల్ట్ వంటివి కూడా ఉన్నాయి.

**హ్యుందాయ్ ఎక్స్‌టర్**

2023లో అత్యధిక అమ్మకాలు పొందిన హ్యుందాయ్ ఎక్స్‌టర్.. ఆరు ఎయిర్‌బ్యాగులు, రియర్ పార్కింగ్ కెమెరా, ఐసోఫిక్స్ సీట్లు, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్, వెహికల్ స్టెబిలిటీ మేనేజ్‌మెంట్ మొదలైనవి పొందుతుంది. దీని ధరలు రూ. 6 లక్షల నుంచి రూ. 9.48 లక్షల మధ్య ఉన్నాయి.

**మారుతి సుజుకి స్విఫ్ట్**

ఆరు ఎయిర్‌బ్యాగులు, హిల్ హెూల్డ్ అసిస్ట్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, రియర్ పార్కింగ్ కెమెరా, ఏబీఎస్ విత్ ఈబీడీ, ఐసోఫిక్స్ సీట్లు వంటి సేఫ్టీ ఫీచర్స్ కలిగిన మారుతి స్విఫ్ట్ ధర రూ. 6.49 లక్షల నుంచి రూ. 9.50 లక్షల మధ్య ఉంది. ఇది పెట్రోల్, CNG రూపంలో అమ్మకానికి అందుబాటులో ఉంది. ఇంజిన్ 5-స్పీడ్ మాన్యువల్ లేదా 5-స్పీడ్ ఆటోమాటిక్ గేర్‌బాక్స్ ఆప్షన్స్ పొందుతుంది.

**సిట్రోయెన్ సీ3**

ఫ్రెచ్ వాహన తయారీ సంస్థ అయిన.. సిట్రోయెన్ తన సీ3 కారులో కూడా ఆరు ఎయిర్‌బ్యాగ్స్ అందిస్తోంది. రూ. 6.16 లక్షల ప్రారంభ ధర వద్ద లభించే ఈ కారు.. ఏబీఎస్ విత్ ఈబీడీ, హిల్ హెూల్డ్ అసిస్ట్, డే - నైట్ ఐఆర్వీఎమ్ వంటి వాటిని పొందుతుంది. తక్కువ ధరలో.. మంచి సేఫ్టీ ఫీచర్స్ కలిగిన కార్ల జాబితాలో సిట్రోయెన్ సీ3 ఒకటి.

# ఉద్యోగులకు మరో అవకాశం: ఆ గడువు మార్చి 15 వరకు పొడిగింపు

ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కటికీ ఈపీఎఫ్ఓ అకౌంట్ ఉంటుంది. వీరందరూ.. ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం కింద ప్రయోజనాలను పొందడానికి, యూనివర్సల్ అకౌంట్ నంబర్ యాక్టివేట్ చేయడానికి మాత్రమే కాకుండా.. మీ బ్యాంక్ ఖాతాను ఆధార్‌తో లింక్ చేయాలి. దీనికి గడువును ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ మార్చి 15, 2025 వరకు పొడిగించింది. ఈపీఎఫ్ఓ.. ఈఎల్ఐ స్కీమ్ కింద ప్రయోజనాలను పొందడానికి, యూఏఎన్ యాక్టివేషన్ % a% బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో లింక్ చేయడం తప్పనిసరి. దీనికోసం గడువును మార్చి 15కు పొడిగిస్తూ ఈపీఎఫ్ఓ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కార్మిక %a% ఉపాధి మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 21, 2025న జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. ఈ గడువును ఇప్పటికే పలుమార్పు పొడిగించారు. కాగా ఇప్పుడు మరోమారు పొడిగించారు.




**యూఏఎన్ అంటే ఏమిటి?**

యూఏఎన్ అనేది.. అర్హత కలిగిన జీతం పొందే ఉద్యోగికి 'ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్' కేటాయించిన 12-అంకెల సంఖ్య. ఇది వారి కెరీర్ అంతటా వివిధ యజమానులలో వారి PF ఖాతాలను నిర్వహించడానికి ఒకే యాక్సెస్ పాయింట్‌గా పనిచేస్తుంది. ఒకే సంఖ్య కింద వారి ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్‌లను ట్రాక్ చేయడానికి, యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుంది. యూఏఎన్ ఎలా యాక్టివేట్ చేసుకోవాలంటే ఈపీఎఫ్ఓ మెంబర్ మొదట అధికారిక ఈపీఎఫ్ఓ పోర్టల్ ఓపెన్ చేయాలి. అధికారిక పోర్టల్ ఓపెన్ చేసిన తరువాత సర్వీసెస్ సెలక్ట్ చేసి.. అందులో ఫర్ ఎంప్లాయీఎస్ ఆప్షన్ ఎంచుకోవాలి. తరువాత మెంబర్ యూఏఎన్ లేదా ఆన్‌లైన్ సర్వీసెస్ మీద క్లిక్ చేయాలి. ఆలా క్లిక్ చేసిన తరువాత ఓ కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. కొత్త పేజీలో.. కుడివైపు కింద భాగంలో ఇంపార్టెంట్ లింక్స్ విభాగంలో యాక్టివేట్ యువర్ యూఏఎన్ అనే ఆప్షన్ మీద క్లిక్ చేయాలి. క్లిక్ చేయగానే.. ఒక ఫారమ్ వంటిది కనిపిస్తుంది. అందులో మీ పేరు, పుట్టిన తేదీ, ఫోన్ నెంబర్ వంటి అవసరమైన అన్ని వివరాలను ఫిల్ చేయాలి. అన్నీ ఫిల్ చేసిన తరువాత క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి, ధృవీకరించడానికి కింద కనిపించే బాక్స్ మీద క్లిక్ చేయాలి. తరువాత గెట్ ఆథరైజేషన్ పిన్ మీద క్లిక్ చేయాలి. ఇలా చేసిన తరువాత మీరు ఎంటర్ చేసిన మొబైల్ నెంబర్‌కి ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసిన తరువాత.. ఐ అగ్రీపై క్లిక్ చేయాలి.

# సారీ..
# నిన్ను పంపలేకపోయా..!

న్యూఢిల: ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2025 సీజన్ లో భాగంగా యూపీ వారియర్స్ చేతిలో రాయల్ ఛాలెంజర్స్ జట్టు ఓటమి పాలైన వేళ..ఆర్సీబీ స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన.. తన టీమ్ మేట్ ఎల్లిస్ పెర్రీకి సారీ చెప్పింది. బెంగళూరు, యూపీ మధ్య హోరాహోరీగా సాగిన ఆ మ్యాచ్... సూపర్ ఓవర్‌కు దారి తీసింది. 9 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఆర్సీబీని.. యూపీ జట్టు 4 పరుగులకే కట్టడి చేసింది. అయితే, తమ జట్టులోని ఆల్ రౌండర్ ఎల్లీస్ పెర్రీని సూపర్ ఓవర్‌కు పంపి ఉంటే ఫలితం మరోలా ఉండేదని, దీనికి తాను ఎల్లిస్‌కు సారీ చెబుతున్నానని స్మృతి వాపోయింది. అప్పుడప్పుడు ఇలాంటివి జరుగుతుంటాయని, ఈ ఫలితాన్ని అంగీకరించి, మరోసారి బలంగా తిరిగి వస్తామని మంధాన చెప్పుకొచ్చింది.







# చేతబడి చేయించి గెలిచారు..

న్యూఢిల్లీ: ఐసీసీ ట్రోఫీలో భాగంగా భారత జట్టు మీద ఘోర పరాజయం పాలైన పాకిస్థాన్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించిన వేళ.. పరాజయ కారణాలపై అక్కడి మీడియా వింతకారణాలు చెబుతోంది. భారత జట్టు 22 మంది తాంత్రికులను దుబాయ్ తీసుకొచ్చి తమ జట్టుపై చేతబడి చేయించి గెలిచిందని డిస్కవర్ పాకిస్థాన్ మీడియా సంస్థ చర్చలో పాల్గొన్న పలువురు వక్తలు చెప్పుకొచ్చారు. వారిలో ఒకరు మాట్లాడుతూ..'భారత్ నుంచి వచ్చిన తాంత్రికులు పాక్ ఆటగాళ్ల ఏకాగ్రతను దెబ్బతీసేలా ప్రయోగం చేశారు' అనగా, 'ఆ.. అది ముమ్మాటికీ నిజమే. అందుకే భారత్ మన దేశంలో ఆడటానికి నిరాకరించింది. ఎందుకంటే మనం ఇక్కడ తాంత్రికులను అనుమతించం కదా' అని మరో వ్యాఖ్యాత చెప్పుకొచ్చాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

# కొత్త బ్యాట్‌తో ధోనీ

న్యూఢిల్లీ: ఐపీఎల్ 2025 కోసం సీఎస్కే స్టార్ బ్యాటర్ ధోనీ ప్రాక్టీస్ మొదలు పెట్టారు. ఈ సీజన్‌లో ధోనీ అన్ క్యాప్డ్‌ప్లేయర్‌గా చెన్నై సూపర్ కింగ్స్ తరఫున బరిలోకి దిగనున్న ధోనీ కొత్త బ్యాట్‌తో ఆడనున్నట్లు సమాచారం. అలాగే, ఈ సీజన్ కోసం సీఎస్కే నిర్వహించనున్న ప్రీ ఐపీఎల్ క్యాంప్‌కు కూడా ధోనీ హాజరుకానున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. సాధారణంగా 1250-1300 గ్రాముల బరువైన బ్యాట్‌తో ఆడే ధోనీ ఈసారి బ్యాట్ బరువును తగ్గించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మేరఠ్ కు చెందిన సాన్స్ పరీల్స్ గ్రీన్ ల్యాండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నాలుగు బ్యాట్లను ధోనీకి డెలివరీ చేసిందని ఆయన టీమ్ తెలియజేసింది.




# కెప్టెన్సీకి నేను రెడీ




న్యూఢిల్లీ: ఐపీఎల్ లీగ్‌లో రాబోయే సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టును.. కెప్టెన్ హోదాలో నడిపించాలని ఉందని ఆ జట్టు ఆల్ రౌండర్ వెంకటేశ్ అయ్యర్ వ్యాఖ్యానించారు. తనకు కెప్టెన్‌గా అనుభవం లేదని.. అయినా జట్టును నడిపించే ఛాన్స్ వస్తే మాత్రం అందుకు రెడీగా ఉన్నానని తెలిపాడు. మార్చిలో జరగనున్న ఐపీఎల్‌లో తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు.. బెంగళూరు జట్టును ఢీకొట్టనుంది. గత సీజన్‌లో కేకేఆర్ జట్టుకు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించగా, మరోసారి శ్రేయాస్‌ను టీమ్ రిటైన్ చేసుకోకపోవటంతో ఇప్పటికి ఆ జట్టుకు సారథి లేదు. కాగా, కెప్టెన్సీ అనేది ఒక ట్యాగ్ మాత్రమేనని, తాను టీమ్ వర్క్ మీద నమ్మకం ఉంచుతానని వెంకటేశ్ అయ్యర్ చెప్పుకొచ్చారు.

# మెప్పిస్తున్న.. మ్యాడ్ స్క్వేర్ టీజర్



హైదరాబాద్: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్.. మ్యాడ్ స్క్వేర్. గతంలో వచ్చిన మ్యాడ్ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రంలో.. నార్నె నితిన్, సంగీత్ శోభన్‌తో పాటు మరికొంత నటులు నటిస్తున్నారు. ఈ సినిమాకు కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా.. సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ మూవీ మార్చి 29న రిలీజ్ కానుండటంతో ప్రమోషన్లలో భాగంగా మంగళవారం మూవీ టీమ్.. టీజర్‌ను విడుదల చేసింది. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, ప్రముఖ ఛాయాగ్రాహకుడు శామ్‌దత్ కెమెరా, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా పనిచేశారు. ఫస్ట్ పార్ట్‌లాగే ఇదీ ప్రేక్షకులను కితకితలు పెట్టించనుందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది.



# నటుడు గోవిందా విడాకుల బాట

హైదరాబాద్: ప్రముఖ బాలీవుడ్ నటుడు గోవిందా, అతని భార్య సునీతా అహుజాలు విడాకులు తీసుకోనున్నారు. కొంతకాలంగా విడివిడిగా ఉంటోన్న ఈ జంట తమ 37 ఏడేళ్ల తమ వైవాహిక బంధానికి వీడ్కోలు పలకనున్నారు. కొంతకాలంగా తాము విడివిడిగా ఉంటున్నామని, తాను తన కూతురు, కొడుకుతో ఉంటున్నట్లు సునీత తెలిపారు. కాగా, ఓ 30 ఏళ్ల మరాఠి నటితో గోవిందా రిలేషన్ షిప్‌లో ఉండటమే ఈ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. గోవింద, సునీత 1987 మార్చి 11న ప్రేమ వివాహం చేసుకున్నారు. వివాహ సమయంలో సునీత వయసు కేవలం.. 18 సంవత్సరాలే. కాగా, 1986లో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన గోవిందా ఫ్యామిలీ, కామెడీ సినిమాలతో మంచి పేరు సంపాదించిన సంగతి తెలిసిందే.

# బుట్టబొమ్మ బోల్డ్ ఫోటో షూట్..



హైదరాబాద్: నాగ చైతన్యతో 'ఒక లైలా కోసం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమై తన అందం, అభినయంతో అతి తక్కు వ సమయంలోనే పాపులర్ అయిన నటి.. పూజా హెగ్డే. అల వైకుంఠపురం సినిమాతో పొడుగు కాళ్ల సుందరిగా గుర్తింపు పొందిన పూజాకు ఆ తర్వాత పెద్ద విజయాలేమీ అందకపోవటంతో భాషతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తూ పోతోంది. ప్రస్తుతం తమిళ హీరో విజయ్ సరసన నటిస్తున్న ఈ అందాల భామ.. సినిమాల గ్యాప్‌లో ఫోటో షూట్‌లు చేస్తూ వాటిని సోషల్ మీడియా ద్వారా తన అభిమానులకు షేర్ చేస్తోంది. తాజాగా, బ్లాక్ అండ్ వైట్ ట్రెండీ డిజైన్ డ్రెస్‌లో దిగిన ఫోటోలను ఇన్‌స్టాలో షేర్ చేసింది. అవి చూసిన ఆమె అభిమానులు.. వావ్, బ్యూటిఫుల్ అంటూ తమదైన శైలిలో కామెంట్స్ చేస్తున్నారు.

# కాంగ్రెస్‌పై ప్రీతీ జింటా ఫైర్..



హైదరాబాద్: న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్‌లో ప్రముఖ నటి ప్రీతీ జింటా తీసుకున్న రూ. 18 కోట్ల లోన్‌ను కేంద్రం ప్రభుత్వం రద్దుచేసిందని, గత వారం ఆ బ్యాంకును మూసేయడంతో డిపాజిటర్లు రోడ్డునపడ్డారంటూ కేరళ కాంగ్రెస్ పార్టీ ఎక్స్ వేదికగా చేసిన పోస్టుపై ప్రీతి స్పందించింది. ఓ రాజకీయ ఇలాంటి ఫేక్ న్యూస్ ప్రచారం చేయడం సిగ్గు చేటని ఆమె మండిపడ్డారు. తాను తీసుకున్న రుణాన్ని పదేళ్ల క్రితమే తిరిగి చెల్లించానని, ఇకపై తప్పుడు ప్రచారం మానుకోవాలని ఆమె స్పష్టం చేశారు.'ట్విట్టర్‌లో కాంగ్రెస్ పార్టీ చేసిన పోస్ట్ చూసి షాకయ్యా. నా అప్పు మాఫీ కాలేదు. ఒక రాజకీయ పార్టీ ఏమీ తెలియకుండానే తన పేరును ఎందుకు వాడిందో తెలియదు. సాధారణంగా ఇలాంటి వాటి మీద నేను స్పందించను. కానీ, క్లారిటీ కోసమే ఆ పార్టీ వ్యాఖ్యలపై స్పందిస్తున్నాను" అంటూ ప్రీతిజింటా వెల్లడించింది.